Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

సోమవారం 7
ఏప్రిల్ 2025

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్


సంపుటి : 8
సంచిక : 37
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar




## తీవ్ర సంక్షోభంలో

# విశ్వవిద్యాలయాలు

### భవిష్యత్తుపై విద్యార్థులలో గందరగోళం

### సీఎం రేవంత్ రెడ్డి చొరవ చూపాలి

- తక్షణంగా శాశ్వత అధ్యాపక నియామకాలు చేపట్టాలి..
- యూనివర్సిటీల్లో కాంట్రాక్టు లెక్చరర్లకు పేస్కేలు అమలు చేయాలి..
- గెస్ట్ లెక్చరర్స్ నియామకంలో యూజిసి విధివిధానాలు పాటించాలి..
- పరిశోధనల కోసం రాష్ట్ర స్థాయి రిసర్చ్ ఫండింగ్ బోర్డు ఏర్పాటు చేయాలి..
- మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు.. డిజిటల్ లైబ్రరీలు,ఈ-కంటెంట్ అభివృద్ధి
- యూనివర్సిటీలకు స్వయం సమర్థత పెంచేందుకు స్వతంత్రంగా నిధులు సేకరించేందుకు అనుమతి..
- విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాల ఏర్పాటు..
- జాతీయ,అంతర్జాతీయ ప్రమాణాల మేరకు అకడెమిక్ సవరించాలి..



(డాక్టర్ బోట్ల బిక్షపతి, జేఏసీ చైర్మన్ - జేఎన్టీయూహెచ్)

(శుభ తెలంగాణ ప్రత్యేక కథనం/ ఎడిటర్ చంద్రశేఖర్)

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి మార్గంలో దూసుకెళ్తున్నప్పటికీ, ఉన్నత విద్య రంగంలో ఉన్న విశ్వవిద్యాలయాలు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. తెలంగాణలో యువతకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉన్న విశ్వవిద్యాలయాలు అత్యవసర పునర్నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ చొరవ తీసుకొని అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని డాక్టర్ బోట్ల బిక్షపతి పేర్కొన్నారు.

**అధ్యాపకుల కొరత లి- విద్యా స్థాయికి పెను సవాల్**

ఉస్మానియా, జేఎన్టీయూహెచ్, కాకతీయ, పాలమూరు వంటి విశ్వవిద్యాలయాల్లో పర్మినెంట్ అధ్యాపకుల కొరత తీవ్రమైంది. కొన్ని విభాగాల్లో పది సంవత్సరాలుగా నియామకాలు జరగలేదు. ఫలితంగా విద్యా నాణ్యత తీవ్రంగా దెబ్బతింటోంది. అధ్యాపకులే విశ్వవిద్యాలయాల శక్తి అయినప్పుడు వారి లేకపోవడమే విద్యా వ్యవస్థ అంధకారంలోకి నెట్టి వేసినట్లేనని, సీఎం రేవంత్ రెడ్డి ఈ సమస్యను అత్యంత కీలకంగా గుర్తించి, ప్రత్యేక మేధోబృందాన్ని ఏర్పాటు చేసి నియామకాలకు కార్యాచరణ - మిగతా3లో



## బ్రిజేష్ ట్రిబ్యునల్ ఎదుట స్వయంగా హాజరవుతా

- గోదావరి, కృష్ణా జలాల వివాదంపై ఈనెల 15నుంచి విచారణ జరపనున్న నేపథ్యంలో న్యాయ బృందానికి పూర్తి సహకారం అందిస్తాం
- కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడంపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ గత నెలలో మూడు రోజుల పాటు విచారణ జరిపిన సంగతి తెలిసిందే.
- జల వివాదాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కీలక సమీక్ష

శుభ తెలంగాణ హైదరాబాద్

జల వివాదాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్ అధికారులు, సీనియర్ లాయర్లతో ఆయన చర్చించారు. గోదావరి, కృష్ణా జలాల వివాదంపై ఈనెల 15నుంచి విచారణ జరపనున్న నేపథ్యంలో న్యాయ బృందానికి పూర్తి సహకారం అందిస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. బ్రిజేష్ ట్రిబ్యునల్ ఎదుట స్వయంగా హాజరవుతానని ఆయన చెప్పారు. కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడంపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ గత నెలలో మూడు రోజుల పాటు విచారణ - మిగతా3లో

## లబ్ధిదారులతో సీఎం రేవంత్

# సహపంక్తి భోజనం

- సన్నబియ్యం లబ్ధిదారుల కుటుంబంతో కలిసి సహపంక్తి భోజనం చేశారు సీఎం రేవంత్ రెడ్డి.
- 200 యూనిట్స్ ఉచిత కరెంట్, రూ. 500 గ్యాస్ సిలిండర్ పథకాలు అందుతున్నాయని ఆరా తీశారు సీఎం రేవంత్.
- భూరం శ్రీనివాసరావు అనే లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులతో కలిసి ఆయన భోజనం చేశారు
- ముందుగా రేవంత్ రెడ్డికి స్థానిక మహిళలు మంగళహారతులు ఇచ్చి ఇంట్లోకి ఆహ్వానించారు.



శుభ తెలంగాణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

జిల్లాలోని సారపాకలో సన్నబియ్యం లబ్ధిదారుల కుటుంబంతో కలిసి సహపంక్తి భోజనం చేశారు సీఎం రేవంత్ రెడ్డి. సన్నబియ్యం పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో పలు కుటుంబాలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంలోని నేతలు సహపంక్తి భోజనాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా సారపాకలో రేవంత్ రెడ్డి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. లబ్ధిదారుడి కుటుంబం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ కుటుంబ సభ్యురాలు తులసమ్మను ఆరా తీశారు సీఎం. దొడ్డు బియ్యం పంపిణీ చేసినప్పుడు అసలు తీసుకునేందుకు ఆసక్తి చూపేవాళ్లం కాదని సీఎం రేవంత్ కు చెప్పిన తులసమ్మ.. ఇప్పుడు సన్నబియ్యం ఇవ్వడంతో కుటుంబానికి ఉపయోగంగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేసింది. 200 యూనిట్స్ ఉచిత కరెంట్, రూ. 500 గ్యాస్ సిలిండర్ పథకాలు అందుతున్నాయని ఆరా తీశారు సీఎం రేవంత్. తమకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతో సంతోషకరంగా ఉందని తులసమ్మ - మిగతా3లో

# యూకే డాక్టర్‌నని చెప్పి.. ఏడుగురి ప్రాణాలు తీశాడు..!

**భోపాల్:** యూకే రిటర్న్ డాక్టర్ పేరుతో ఓ వ్యక్తి ఆడిన నాటకం.. ఏడుగురి ప్రాణాలు తీసింది. కార్డియాలజీ స్పెషలిస్టునని 'ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించి మధ్యప్రదేశ్ లోని దామోహ్ జిల్లాలో ఒక ఆస్పత్రిలో జాయినయ్యాడు. ఇక అంతే స్పెషలిస్టు కదా అని .. మేజర్ ఆపరేషన్లను అతనికే అప్పగించింది ఆ ఆస్పత్రి యాజమాన్యం. అంతే అతను ఆపరేషన్లు చేసిన వారిలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడంతో అసలు విషయం బయటపడింది. అతను యూకే డాక్టర్ కాదని, కార్డియాలజిస్ట్ అంతకన్నా కాదనే విషయం వెలుగుచూసింది. దీనిపై జాతీయ మానవ హక్కుల సంఘంగా తీవ్రంగా స్పందించింది. డాక్టర్ ఎన్ జాన్ కెన్ పేరుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో జాయిన్ అయ్యాడు ఓ డాక్టర్. యూకేకు చెందిన కార్డియలాజిస్ట్ నని, దానికి సంబంధించిన డాక్యుమెంట్లన్నీ చూపించడంతో అతన్ని డాక్టర్ గా అపాయింట్ చేసుకున్నారు. ఇక అంతే వరుస పెట్టి ఆపరేషన్లు చేసేస్తున్నాడు. హార్ట్ కు సంబంధించిన ప్రాబ్లమ్ అయితే ఇక ఆపరేషన్ అంటున్నాడు. ఆ ఆస్పత్రికి ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భవా స్కీమ్ కు కూడా ఉండటంతో పేషెంట్లు కూడా ఆపరేషన్ కు సరే అంటున్నారు. ఇలా 15 ఆపరేషన్లు చేయగా, 7 గురు చనిపోయారు. దాంతో దీనిపై ఆరా తీయగా అతను ఫేక్ డాకర్ట్ అనే విషయం తెలిసింది. ఈ విషయాన్ని దామోహ్ చైల్డ్ వెల్ఫే కమిటీ అధ్యక్షుడు దీపక్ తివారీ వెలుగులోకి తేవడంతో ఆ డాక్టర్ అసలు కథ బయటపడింది. ఒక నెలలోనే అతను చూసిన ఏడుగురు మృతి చెందడంతో పెద్ద ఎత్తున కలకలం రేగింది.




ఫేక్ డాక్టర్ పై విచారణకు ఆదేశించాం

ఒక డాక్టర్ గా ఆస్పత్రిలో జాయిన్ అయి ఏడుగురు ప్రాణాలు పోవడానికి కారణమైన సదరు ఫేక్ డాక్టర్ పై విచారణ జరుగుతోందని జాతీయ మానవ హక్కుల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు తమకు ఫిర్యాదు అందిందని, ఏడుగురి ప్రాణాలు పోవడానికి కారణమైన డాక్టర్ వ్యవహారం మా దృష్టికి వచ్చింది. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భవా స్కీమ్ కింద ఆపరేషన్ చేసి ఆ నిధుల్ని కూడా దుర్వినియోగం చేశాడు' అని ఎన్ హెచ్ ఆర్సీ సభ్యుడు ప్రియాంక్ కనూన్ గో పేర్కొన్నారు.

# సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబీ

**మదురై:** సీపీఎం నూతన ప్రధాన కార్యదర్శిగా కేరళ విద్యాశాఖ మాజీ మంత్రి ఎంఏ బేబీ ఎన్నికయ్యారు. మూడేళ్లకు ఒకసారి జరిగే సీపీఎం మహాసభలు తమిళనాడులోని మదురైలో ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆయనను పార్టీ కొత్త కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఎంఏ బేబీ పేరును పార్టీ కోఆర్డినేటర్ ప్రకాష్ కారత్ ప్రతిపాదించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో సీతారాం ఏచూరి మృతి అనంతరం ఆ పదవి ఖాళీగా ఉంది. తాత్కాలికంగా కారత్ ఆ పదవిని నిర్వహిస్తూ వచ్చారు. మైనారిటీ కమ్యూనిటీ నుంచి సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తొలి నేత బేబీనే కావడం విశేషం. కొల్లాం జిల్లా ప్రక్కులాంలో జన్మించిన బీఏ బేబీ (70) కేరళ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ)తో ప్రారంభించి ఆ తర్వాత జాతీయ అధ్యక్షుడు అయ్యారు. ఆ తర్వాత పార్టీ యూత్ వింగ్ డీవైఎఫ్ఐలో పనిచేశారు. 1986 నుంచి 1998 వరకూ సీపీఎం రాజ్యసభ సభ్యుడిగా ఆయన సేవలందించారు. ఎమర్జెన్సీ కాలంలో విద్యార్థులను, యువతను సమీకరించి జైలుశిక్ష కూడా అనుభవించారు. 2006లో కేరళలోని కుందర నుంచి తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. 2006 నుంచి 2011 వరకూ వీఎస్ అచ్యుతానంద్ మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా



పనిచేశారు. 2011లో తిరిగి కుందర నియోజకవర్గం నుంచే తిరిగి గెలుపొందారు. 2012 నుంచి సీపీఎం పొలిట్ బ్యూరోలో కొనసాగుతున్నారు. కాగా, 2014 లోక్‌సభ ఎన్నికల్లో కొల్లాం నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

# కార్యకర్తలే మా పార్టీకి వెన్నెముక..

దేశంలోని ప్రజలందరూ బీజేపీ సుపరిపాలనను చూస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇటీవల పార్టీ సాధించిన అనేక చారిత్రాత్మక విజయాల్లో ఇది ప్రతిబింబిస్తోందని తెలిపారు. బీజేపీ 45వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన శుభాకాంక్షలు చెప్పారు. దేశ పురోగతికి, 'వికసిత్ భారత్' స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నామని ప్రధాని చెప్పారు. కార్యకర్తలే తమ పార్టీకి వెన్నెముకని, వారి శక్తి, ఉత్సాహం ప్రేరణాదాయకమని ప్రధాని మోదీ అన్నారు. కొన్ని దశాబ్దాలుగా పార్టీ బలోపేతం కోసం తమ జీవితాలను అంకితం చేసినవారి సేవలు మరువలేనివని చెప్పారు. దేశ ప్రజలు తమ పార్టీ సుపరిపాలన అజెండాను చూస్తున్నారని, ఇటీవలి సంవత్సరాల్లో మేం



సాధించిన విజయాల్లో ఇది ప్రతిబింబిస్తోందని తెలిపారు. లోక్‌సభ, అసెంబ్లీలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్నో విజయాలు సాధించామన్నారు. సమాజ సర్వతోముఖాభివృద్ధి దిశగా తమ ప్రభుత్వాలు సేవ చేస్తుంటాయని ప్రధాని ట్వీట్ చేశారు. కాగా బీజేపీని 1980లలో స్థాపించారు. 1984లో జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ కేవలం రెండు లోక్‌సభ స్థానాలను మాత్రమే గెలుచుకుంది. అయితే ఆ తర్వాత అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీల నాయకత్వంలో అంచెలంచెలుగా ఎదిగింది. ఆ విధంగా 1990లలో మిత్రపక్షాలతో కలిసి అధికారంలోకి వచ్చింది. అనంతరం 2014 నుంచి ప్రధాని మోదీ నేతృత్వంలో వరుసగా మూడోసారి కేంద్రంలో కొలువుదీరింది. కాగా పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి అమిత్ షా సైతం శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు.

# మీ లక్ష్యం ఏమిటో ప్రతీరోజూ ప్రభుత్వం చెబుతుందా?'

**న్యూఢిల్లీ:** భారత్ కు చెందిన స్టార్టప్ కంపెనీలను ఉద్దేశించి కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు బోట్ సహ వ్యవస్థాపకుడు అమన్ గుప్తా మద్దతు పలికారు. పీయూష్ చేసిన వ్యాఖ్యలపై పెద్ద ఎత్తును దుమారం చెలరేగగా, అమన్ గుప్తా మాత్రం ఆయన వ్యాఖ్యలను సమర్థించారు. పీయూష్ చేసిన వ్యాఖ్యల్లో తనకు తప్పు ఏమీ కనిపించలేదంటూ ట్వీట్ చేశారు అమన్ గుప్తా. పీయూష్ చెప్పిన దానికి వక్రార్థాలు సృష్టించాల్సిన అవసరం లేదన్నారు. ఆయన మాట్లాడిన మొత్తం స్పీచ్ తాను విన్నానని, అందులో తప్పులు వెతకాల్సిన పని లేదన్నారు అమన్ గుప్తా. 'స్టార్టప్ ఫౌండర్లకు మీ లక్ష్యం పెద్దదిగా ఉండాలని ప్రతీరోజూ గవర్నమెంట్ చెప్పలేదు. నేను అక్కడ ఉన్నాను. నేను ఆయన ప్రసంగం మొత్తం విన్నాను. ఆయనేమీ కంపెనీల వ్యవస్థాపలకు వ్యతిరేకం కాదు. మనపై నమ్మకం ఉంది కాబట్టే కొన్ని మంచి విషయాలు చెప్పారు. భారత్ ఇంకా మరింత వేగంగా ముందుకెళ్లాలనేది ఆయన ఉద్దేశం. మన లక్ష్యాలు ఉన్నతంగా ఉన్నప్పుడే వాటిని సాధించడానికి కృషి చేస్తామనేది ఆయన చెప్పిందాంట్లో నాకు అర్థమైంది' అంటూ అమన్ గుప్తా పేర్కొన్నారు. ఇటీవల జరిగిన స్టార్టప్ మహాకుంబ్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి గోయల్ మాట్లాడుతూ.. దేశంలోని పలు స్టార్టప్ కంపెనీలు ఫుడ్



డెలివరీ, బెట్టింగ్, ఫాంటసీ స్పోర్ట్స్ వంటి యాప్‌లపై ఎక్కువగా దృష్టి సారించాయి. కానీ చైనాలోని స్టార్టప్‌లు మాత్రం ఇందుకు భిన్నమైన రంగాలను ఎంచుకుంటున్నాయని చెప్పారు. కానీ, మనం ఐస్‌క్రీం, చిప్స్ అమ్మడం దగ్గరే ఉన్నాం. ఇక్కడే మనం ఆగిపోకూడదు. డెలివరీ బాయ్స్/గర్ల్స్‌గానే మిగిలిపోదామా? అదే భారత్ లక్ష్యమా..? అది స్టార్టప్‌ల ఉద్దేశం కాదు కదా" అని అన్నారు. అయితే.. భారత్‌లో స్టార్టప్‌లను తక్కువ చేయొద్దంటూ కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తడంతో కాంగ్రెస్ పార్టీ ఓ పోస్ట్ చేసింది. ఈ క్రమంలోనే భారత్ లోని పలు స్టార్టప్ కంపెనీలు కూడా పీయూష్ గోయల్ వ్యాఖ్యలపై ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ తరుణంలో బోట్ సహ వ్యవస్థాపకుడు పీయూష్ కు మద్దతుగా నిలవడం విశేషం.

## కొందరు ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటారు



**రామేశ్వరం:** కొంతమందికి కారణం లేకుండానే ఎప్పుడూ ఏడ్చే అలవాటు ఉంటుందంటూ తమిళనాడు సీఎం స్టాలిన్‌పై ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. తమిళనాడులోని రామేశ్వరంలో జరిగిన బహిరంగ సభ వేదికగా ఆయన ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సీఎం స్టాలిన్ చేసిన ఆరోపణలను ఆయన ఖండిస్తూ.. కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు భారీగా నిధులు కేటాయిస్తోందని, గతంతో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ నిధులు ఇచ్చామని తెలిపారు. త్రిభాషా విధానంపై స్టాలిన్ వ్యాఖ్యలకు మోదీ కౌంటర్ ఇస్తూ.. తమిళ నాయకులు నాకు లేఖలు రాస్తుంటారు. ఒక్కరు కూడా మ్యాతభాష తమిళంలో సంతకం చేయరు. తమిళ భాషను గౌరవించండి.. తమిళంలో సంతకం చేయండి. చాలా రాష్ట్రాల్లో మ్యాతభాషలో వైద్య విద్యా బోధన జరుగుతోంది. తమిళనాడులోనూ తమిళంలో వైద్య విద్యను అందించాలి. గత దశాబ్దంలో తమిళనాడు అభివృద్ధికి కేంద్రం భారీగా నిధులు కేటాయించాం. రైల్వే ప్రాజెక్టులకు నిధులు గణనీయంగా పెంచాం" అని మోదీ చెప్పారు. "తమిళనాడు అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది. 2014 నుంచి అధికంగా తమిళనాడుకు ఇచ్చాం. 2014కు ముందు రైల్వే ప్రాజెక్టుకు ఏటా రూ.900 కోట్లు మాత్రమే వచ్చేవని, ఈ ఏడాది తమిళనాడు రైల్వే బడ్జెట్ రూ.6,000 కోట్లకు పైగా ఉందన్నారు. అభివృద్ధి చెందిన భారత్‌లో తమిళనాడు పాత్ర చాలా గొప్పదన్న మోదీ.. ఈ రాష్ట్రం ఎంత బలంగా ఉంటే మన దేశం అంత వేగంగా అభివృద్ధి చెందుతుందని ప్రధాని మోదీ అన్నారు.

## 131 రోజుల తర్వాత.. నిరాహార దీక్ష విరమించిన రైతు నాయకుడు జగ్జీత్ సింగ్



**చండీగఢ్:** పంజాబ్‌కు చెందిన రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్వాల్ 131 రోజుల తర్వాత నిరాహార దీక్షను విరమించారు. అయితే డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని రైతు సంఘాలను కోరారు. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)పై చట్టపరమైన హామీ, ఇతర రైతు సమస్యలపై కేంద్ర ప్రభుత్వం చర్యల కోసం గత ఏడాది నవంబర్ 26న జగ్జీత్ సింగ్ దల్వాల్ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. అయితే ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో రైతు సంఘాలు ఆందోళన చెందాయి. ఈ నేపథ్యంలో ఫతేగఢ్ సాహిబ్ జిల్లాలోని సిర్హింద్‌లో కిసాన్ మహాపంచాయత్ నిర్వహించారు. జగ్జీత్ సింగ్ దల్వాల్ నిరాహార దీక్ష ముగించాలని రైతుల సమావేశంలో కోరారు. ఈ నేపథ్యంలో శనివారం హాస్పిటల్ నుంచి ఇంటికి చేరుకున్న జగ్జీత్ సింగ్ దల్వాల్, రైతుల విన్నపం మేరకు ఆమరణ నిరాహార దీక్షను ఆదివారం ముగించారు. అయితే డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని రైతు సంఘాలను ఆయన కోరారు. మరోవైపు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు కూడా నిరాహార దీక్షను విరమించాలని జగ్జీత్ సింగ్ దల్వాల్‌ను శనివారం కోరారు. రైతుల డిమాండ్లపై రైతు సంఘాల ప్రతినిధులతో మే 4న కేంద్ర ప్రభుత్వం చర్చలు జరుపుతుందని బిట్టు హామీ ఇచ్చారు. 'మీ ఆరోగ్యం చాలా ముఖ్యం. పంజాబ్ ప్రజలకు మీ జీవితం విలువైనది. రైతులు, రైతు కూలీల పోరాటానికి మీ నాయకత్వం ఎల్లప్పుడూ అవసరం' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## ప్రధాని పంబన్ కార్యక్రమానికి సీఎం స్టాలిన్ గైర్హాజరు.. డీలిమిటేషన్‌పై హామీ ఇవ్వాలని డిమాండ్



**చెన్నై:** తమిళనాడులోని రామేశ్వరంలో కొత్తగా నిర్మించిన పంబన్ రైల్వే బ్రిడ్జిని ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పాల్గొన్న ఈ కార్యక్రమానికి సీఎం ఎంకే స్టాలిన్ గైర్హాజరయ్యారు. అయితే న్యాయమైన డీలిమిటేషన్‌పై ప్రధాని హామీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం ఒక కార్యక్రమంలో సీఎం స్టాలిన్ మాట్లాడారు. ప్రతిపాదిత డీలిమిటేషన్ కసరత్తుపై తమిళనాడు ప్రజలు భయాందోళనలు చెందుతున్నారని తెలిపారు. కాగా, తమిళనాడు ప్రజల భయాలను పోగొట్టేందుకు ప్రధాని మోదీ హామీ ఇవ్వాలని ఎంకే స్టాలిన్ డిమాండ్ చేశారు. 'తమిళ గడ్డపై నిలబడి, ప్రధాని స్పష్టమైన హామీ ఇవ్వాలి. తమిళనాడుతో సహా జనాభా పెరుగుదలను విజయవంతంగా నియంత్రించిన ఇతర రాష్ట్రాలకు రాబోయే డీలిమిటేషన్ కసరత్తులో ఎలాంటి జరిమానా విధించకూడదు. పార్లమెంటు సీట్లలో రాష్ట్రాల వాటా చెక్కుచెదరకుండా చూడాలి. న్యాయమైన డీలిమిటేషన్ విధానంపై పార్లమెంట్‌లో తీర్మానం చేయాలి' అని అన్నారు. ప్రధాని మోదీ దీని గురించి బహిరంగంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# తీవ్ర సంక్షోభంలో విశ్వవిద్యాలయాలు

-మొదటిపేజీ తరువాయి
రూపొందించాలి.
కాంట్రాక్టు లెక్చరర్ల నియామకం %-% నిపుణుల కమిటీ ఆధారంగా కొనసాగించాలి.. ప్రతి సంవత్సరం కాంట్రాక్టు ఫ్యాకల్టీని నోటిఫికేషన్ ద్వారా తీసుకోవాలి. యూనివర్సిటీలో పీహెచ్.డి చేసిన అభ్యర్థులకు అవకాశం కల్పించాలి.గత 15 సంవత్సరాలుగా నియామకాలు జరగకపోవడం దురదృష్టకరం.ఫ్యాకల్టీ ప్రతిభను మూల్యాంకనం చేయడానికి పర్ఫార్మెన్స్ ఇండెక్స్, ఫెషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ తప్పనిసరి చేయాలి. ముఖ్యమంత్రి ఈ విషయంలో నూతన విధానాలను ప్రవేశపెట్టాలి.
అంతేగాక,కాంట్రాక్టు లెక్చరర్లకు తక్షణం పేస్కేలు అమలు చేయాలని యూనివర్సిటీలు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను నిపుణుల కమిటీ ద్వారా వ్యక్తిగత శక్తిసామర్థ్యాలు అర్హతలు మెరుగుపరుచుకున్న వారిని మాత్రమే కోనసాగిస్తూ మిగిలిన ఖాళీలను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలి.

**గెస్ట్ లెక్చరర్స్ – యూజిసి విధానాలు తప్పనిసరి**
తెలంగాణలో వేల మంది గెస్ట్ లెక్చరర్లు సేవలందిస్తున్నారు. నియామక సమయంలో యూజిసి విధివిధానాలను ఖచ్చితంగా పాటించాలి.గెస్ట్ లెక్చరర్లకు కనీస వేతన భద్రత కల్పించాలని డాక్టర్ బిక్షపతి కోరారు.

**పరిశోధన శూన్యత – ఆవిష్కరణలకు ఆటంకం**
ప్రపంచస్థాయి పరిశోధనల ద్వారా రాష్ట్ర ఖ్యాతిని పెంచే అవకాశం ఉన్నప్పటికీ,తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లో పరిశోధన వెనుకబడి ఉంది. ఆధునిక పరికరాలు లేవు,ప్రాజెక్ట్ కు నిధులు లేవు,పరిశోధన సంస్కృతి అభివృద్ధి చెందలేదు. పరిశోధనల ఫలితంగా వచ్చే ఉత్పత్తులు,ఆవిష్కరణలే రాష్ట్రానికి ఆర్థికాభివృద్ధి కూడా తీసుకురాగలవు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక పరిశోధన నిధులు ఏర్పాటు చేసి,పరిశోధనలను ప్రోత్సహించే విధానాలను రూపకల్పన చేయాలి.

**పరిపాలనా వ్యవస్థల లోపం %-% అకడెమిక్ పునరుద్ధరణకు ఆటంకం**
విశ్వవిద్యాలయాల్లో పాలనా వ్యవస్థలు సక్రమంగా పనిచేయకపోవడం విద్యా విధానాల నిర్ణయాలను ఆలస్యం చేస్తోంది.బోర్డు ఆఫ్ స్టడీస్,సెనెట్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ వంటి సమితులు సమయానికి సమావేశమవ్వకపోవడం వల్ల సిలబస్ నవీకరణలు,కొత్త కోర్సుల ప్రవేశాలు ఆగిపోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమస్యను గమనించి,అకడెమిక్ పాలనను తిరిగి చురుకుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.

**మౌలిక వసతుల లేమి – విద్యార్థుల అభ్యాసానికి విఘాతం**
లైబ్రరీల్లో పుస్తకాలు లేవు,ల్యాబ్‌లు పనిచేయడం లేదు,హాస్టల్ సదుపాయాలు కనీస స్థాయిలో కూడా లేవు.ఈ పరిస్థితులు విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాయి.ప్రాక్టికల్ బేస్డ్,ఎడ్యుకేషన్,కొరవడింది.పరిశ్రమలతో భాగస్వామ్యం లేకపోవడం వల్ల విద్యార్థులు ఉద్యోగ నైపుణ్యాలను పొందలేకపోతున్నారు.ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని సీఎం రేవంత్ రెడ్డి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి.

**బడ్జెట్ లోపం – అభివృద్ధికి అడ్డంకి**
ప్రతి యూనివర్సిటీకి నిర్దిష్ట బడ్జెట్ లేకపోవడం వల్ల అభివృద్ధి పనులు ఆగిపోయాయి.క్యాంపస్ విస్తరణలు, నూతన భవనాలు,ఆధునిక ల్యాబ్‌లు నిర్మాణానికి నిధులు అందడంలేదు.బడ్జెట్ విడుదలలు కూడా ఆలస్యమవుతూ, నూతన విధానాలు అమలకు నోచుకోకపోవడం తద్వారా అవి నిలిచిపోతున్నాయి నిలిచిపోతున్నాయి.ముఖ్యమంత్రి ఈ లోపాలను గుర్తించి విశ్వవిద్యాలయాల కోసం ప్రత్యేక బడ్జెట్ ప్రకటించాలి. తెలంగాణ విశ్వవిద్యాలయాల పునరుజ్జీవనం కోసం ఇది కీలక సమయం.సీఎం రేవంత్ రెడ్డి ఈ అంశాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని,శాశ్వత పరిష్కారాలను అమలు చేస్తే,రాష్ట్ర యువతకు అద్భుతమైన భవిష్యత్తు లభిస్తుంది అని.డాక్టర్ బోట్ల బిక్షపతి అభిప్రాయాన్ని మీడియా ద్వారా వ్యక్తపరిచారు.

# కాప్రా గాంధీనగర్‌లో అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు





## భక్తుల ఉత్సాహం, "జై శ్రీరామ్" నినాదాలతో మైసమ్మ తల్లి ఆలయం మార్మోగింది...

(శుభ తెలంగాణ/ కాప్రా)
కాప్రా సర్కిల్ పరిధిలోని గాంధీనగర్‌లో ఉన్న మైసమ్మ తల్లి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఆద్యంతం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని, శ్రీరాముల వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణమంతా "జై శ్రీరామ్... జై శ్రీరామ్..." నినాదాలతో మారుమోగిపోయింది. ఆ భక్తి సంద్రంలో ప్రతి ఒక్కరూ తరిచిపోయారు. శ్రీరాముల కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. వేలాదిమంది భక్తులు పవిత్రమైన ప్రసాదాన్ని స్వీకరించి తృప్తి చెందారు. సాయంత్రం నిర్వహించిన శోభాయాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శోభాయాత్రలో శ్రీరాముల విగ్రహాన్ని శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఊరేగించగా, భక్తులు ఉత్సాహంతో పాటలు, నృత్యాలు చేస్తూ అనుసరించారు. ఈ విజయవంతమైన మహోత్సవం వెనుక కమిటీ సభ్యుల కృషి అపారమని నిర్వాహకులు పేర్కొన్నారు. "ఈ మహోత్సవం భక్తుల సహకారంతోనే సాధ్యమైంది. స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మికత, సాంస్కృతిక విలువల పెంపుకు ఇలాంటి వేడుకలు మార్గదర్శకాలు కావాలి" అని వారు తెలిపారు

# 'హైదరాబాద్‌లో కూర్చొని మాట్లాడటం కాదు.. అది చేసిన కేసీఆర్ పుణ్యం'

**సిద్దిపేట:** కాళేశ్వరం ప్రాజెక్టు అనేది ఉత్తర తెలంగాణకు వర ప్రదాయిని.. హైదరాబాద్‌లో కూర్చొని కాళేశ్వరం కూలిందని చెప్పడం కాదు అంటూ ఘాటు విమర్శలు చేశారు మాజీ మంత్రి హరీష్ రావు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును చిన్నచూపు చూస్తున్నది. అన్ని రకాలుగా ప్రభుత్వాన్ని నిద్ర లేపే ప్రయత్నం చేశాం అంటూ వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆదివారం.. చిన్న కోడూరు మండలం చౌడారం గ్రామం వద్ద బిక్క బండకు వెళ్లే కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ..'కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నేడు రంగనాయక సాగర్ రిజర్వాయర్ నుండి బిక్క బండ గుట్టకు నీళ్ళు విడుదల చేయడం జరిగింది. గత ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో భూసేకరణ కోసం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును చిన్నచూపు చూస్తున్నది. ఇవ్వాళ ప్రాజెక్టులో నీళ్ళు ఉన్నాయి. రంగనాయక సాగర్ లో, కొండపోచమ్మ, మిడ్ మానేరు లో నీళ్ళు ఉన్నాయి. కక్షపూరితంగానే ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. కొత్తగా ఒక్క ఎకరం భూ సేకరణ చేయడం లేదు. కేసీఆర్ ప్రాజెక్టులు కట్టి సిస్టం అంత రెడీ చేశారు. పంపు హౌస్‌లు, రిజర్వాయర్లు, సబ్ స్టేషన్లు, మెయిన్ కెనాల్స్, డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ అన్ని రెడీగా ఉన్నాయి. కేవలం భూ సేకరణ చేసి కాలువలు తవ్వి రైతులకు నీళ్లు ఇవ్వాల్సింది ఉంది. కానీ, ఈ సంవత్సరం కాలంలో ఒక్క ఎకరా కూడా కాళేశ్వరం ప్రాజెక్టు కింద భూసేకరణ చేయలేదు. చేయకపోవడం వల్ల చాలా చోట్ల కూడా రైతులు సొంత డబ్బులు పెట్టుకొని రైతులే




స్వచ్ఛందంగా కాలువలు తవ్వుకొని నీళ్లు తీసుకున్న సందర్భం ఉన్నది. కొండెంగులకుంట, బిక్కబండ రైతులు అందరూ వస్తే.. స్వంత డబ్బులతో మిషన్లు పెట్టి.. స్వంత డబ్బులు పెట్టీ, భూ సేకరణలో నష్ట పోతున్న వారికి డబ్బులు ఇచ్చి కాలువలు తవ్వి నీళ్లు అందిస్తున్నాం. ప్రభుత్వం పనిచేయట్లేదు. ప్రేమతో పని చేయాలి కానీ కక్షతో పని చేస్తున్నది. నిన్న కూడా ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడాను. పిల్ల కాలువలు తవ్వితే రైతులకు ఆయకట్టు పెరుగుతుంది. కనీసం 15, 20 కోట్లు భూసేకరణకు విడుదల చేయండి అని కోరాను. అసెంబ్లీలో కూడా కట్ మోషన్ ఇచ్చి నిరసన తెలపడం జరిగింది. అన్ని రకాలుగా ప్రభుత్వాన్ని నిద్ర లేపే ప్రయత్నం చేశాం. కాళేశ్వరం ప్రాజెక్టు అనేది ఉత్తర తెలంగాణకు వర ప్రదాయిని. కోకాకోలా ఫ్యాక్టరీ కూడా కాళేశ్వరం నీళ్లు ఉండబట్టి వచ్చింది. రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది కాళేశ్వరం ప్రాజెక్టు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా కుంగిన ఒకటో రెండో పిల్లర్లను మరమ్మతులు చేసి నీళ్ళు ఇవ్వాలని కోరుతున్న. కాంగ్రెస్ వచ్చాక ఖమ్మంలోని పెద్దవాగు, సుంకిశాల, %వాదీజ% సొరంగం, వట్టెం ప్రాజెక్టులు కూలిపోయాయి. కాళేశ్వరం అంటే మెగా ప్రాజెక్టు. కాళేశ్వరం ద్వారా సిద్ధిపేట నియోజకవర్గంలో 52 వేల ఎకరాలకు నీళ్లు అందిస్తున్నాం. ఇది కేసీఆర్ చేసిన పుణ్యం. హైదరాబాద్ లో కూర్చొని కాళేశ్వరం కూలిందని చెప్పడం కాదు. సిద్ధిపేట ఒక్కటే కాదు ఎన్నో నియోజకవర్గాలకు నీళ్ళు అందుతున్నాయి. ఇప్పటికైనా గోబెల్స్ ప్రచారం ఆపి భూ సేకరణ చేసి కాలువలు తవ్వి రైతాంగానికి నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం' అంటూ వ్యాఖ్యలు చేశారు.

## నెమళ్ల అరుపులు, పోలీసుల లాఠీచార్జీలు, జింకల చావులు, బుల్డోజర్లు కుడా ఏఐ సృష్టేనా..?

**సూర్యాపేట :** కంచె గచ్చిబౌలి భూముల వాస్తవాలను ఏఐకు ముడిపెట్టడం హాస్యాస్పదమని.. నెమళ్ల అరుపులు, పోలీసుల లాఠీచార్జీలు, జింకల చావులు, బుల్డోజర్లు కుడా ఏఐ సృష్టేనా అని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. సీఎం రేవంత్ ఆధ్వర్యంలో జరిగిన రివ్యూలో ఆయన మాట్లాడినట్లు ప్రకటనలో వచ్చిన విషయాలపై జగదీష్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్ తీరు రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చేలా వుందని.. అసలు అది సీఎం స్థాయిలో జరగాల్సిన రివ్యూలా లేదని ఏద్దేవా చేశారు. సీఎం తీరుకు సామాన్య ప్రజలు సైతం నవ్వుకుంటున్నరన్నారు. అధికారులు, అనుచరులు ఇస్తున్న సలహాలపై పునరాలోచన చేసి మాట్లాడితే మంచిదిని హితువు పలికారు. సుప్రీం కోర్టు ఆదేశాలను ధిక్కరించడం రేవంత్ పనిగా పెట్టుకున్నాడని.. ఏఐ యూనివర్సిటీ పెడతానన్న రేవంత్ ఆ విషయంలో ముందుకు సాగుతాడా అని ప్రశ్నించారు. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ కన్నా మీ అనుముల ఇంటెలిజెన్స్‌ను నమ్ముకోవడమే మంచిదని.. వాళ్లిచ్చే బ్రిఫ్‌ను నమ్ముకుని నవ్వులపాలవుతున్నారన్నారు. అసలు %వా×% కంచె గచ్చిబౌలిలో పుట్టిందా.. అక్కడ ఊర కుక్కలు జింకలను చంపింది %వా×% సృష్టేనా అని ప్రశ్నించారు. లేనివి సృష్టించడం.. తప్పుడు ప్రచారాలు చేయడం కాంగ్రెస్, రేవంత్ రెడ్డికే అలవాటన్నారు. అసలు కంచె గచ్చిబౌలి విషయంలో రాజకీయాలు మాట్లాడలేదన్నారు. ఒకవైపు రాష్ట్రం నష్టపోతుంది.. జరిగిన అభివృద్ధి అంతా వెనక్కి పోతుందని.. దీనికి తోడు జాతీయంగా రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటుందని బాధ తప్ప మరొకటి లేదన్నారు. చైనా, పాకిస్తాన్ యుద్దాలకు ఇక్కడ %వా×%కి సంబంధం ఏమిటని..

## బ్రిజేష్ ట్రిబ్యునల్ ఎదుట స్వయంగా హాజరవుతా

-మొదటిపేజీ తరువాయి
జరిపిన సంగతి తెలిసిందే. కృష్ణా జలాల్లో తెలంగాణకు 555 టీఎంసీలు కేటాయించినా, ఏపీకి నష్టమేమీ ఉండదని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ స్పష్టం చేశారు. ఏపీ బేసిన్ బయట ప్రాంతాలకు కృష్ణా జలాలను ఏ మేరకు మళ్లిస్తోందని ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ప్రశ్నించగా.. ఉమ్మడి రాష్ట్రంలో అంతర్గత ఏర్పాటు ద్వారా 512 టీఎంసీలను ఏపీ వినియోగించుకుంటోందని వైద్యనాథన్ వివరించారు.
ఇందులో ఇతర బేసిన్‌లకు 323 టీఎంసీలను మళ్లిస్తోందని, కృష్ణా బేసిన్‌లో 189 టీఎంసీలను మాత్రమే వినియోగిస్తోందని తెలిపారు. ఢిల్లీలో జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్.తాళపత్ర సభ్యులుగా ఉన్న ట్రిబ్యునల్ ఎదుట తన వాదనలు కొనసాగించారు. తదుపరి విచారణను ఏప్రిల్ 15–17కు ట్రిబ్యునల్ వాయిదా వేసింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున తుది వాదనలను వినగా, మిగతా వాదనలను ఏప్రిల్ 15 నుంచి చేపట్టే విచారణలో వింటామని ట్రిబ్యునల్ పేర్కొంది.

## బీజేపీ బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం



మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదు. కాంగ్రెస్ పార్టీ అనేది జాతీయ పార్టీ. ఏదైనా సమిష్టి నిర్ణయాలు ఉంటాయి. అసెంబ్లీ పార్లమెంట్ ఎమ్మెల్సీ ఎన్నికల వలె స్థానిక సంస్థలు ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేకనే రహస్య మిత్రులు బిఆర్ఎస్ తో చీకటి ఒప్పందం. బండి సంజయ్ లో రోజురోజుకు అభద్రత భావం పెరిగిపోతుంది. మోదీ, అమిత్ షా అనుమతి లేకుండా కనీసం టిఫిన్ కూడా చెయ్యడు. సొంత పార్టీ కార్యకర్తలే బండి సంజయ్ వైఖరిపై గుర్రుగా ఉన్నారు. అధ్యక్ష పదవి రాదని తెలిసి బండి సంజయ్ ఆగమాగం అయితుండు. గుర్తింపు కోసమే తాను కేంద్రమంత్రిని అని మర్చిపోయి దిగజారి బండి సంజయ్ మాట్లాడుతుండు. బీజేపీలో ఉనికి కోసం బండి సంజయ్ ఆరాటం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి బండి సంజయ్ కి కనిపించకపోవడం విడ్డూరం. సుదీర్ఘ కాలం అయినా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నియామకం చేసుకోలేని బీజేపీకి కాంగ్రెస్ హై కమాండ్ గురించి మాట్లాడే హక్కే లేదు. సీఎం రేవంత్ రెడ్డి పూర్తి పట్టు సాధించి బట్టే బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు ఆమోదం లభించిందని అవగాహన లేకుండా బండి మాట్లాడుతున్నారు. హెచ్ సీయూ అంశం ఉన్నత న్యాయ స్థాన పరిదిలో ఉంది. ప్రభుత్వం కమిట్ వేసింది. రాజకీయ అవసరాల కోసం బండి సంజయ్ మాట్లాడడం సమంజసం కాదు. మైనార్టీ హక్కుల కోసం నిలబడి కాంగ్రెస్ వక్ఫ్ బోర్డు బిల్లు పై నిర్ణయం తీసుకుంది. కార్పొరేట్ సంస్థలను నయన భయానా బెదిరించి నిధులు రాబట్టుకున్న బీజేపీ నంబర్ వన్ గా నిలిచింది. సన్న బియ్యం బీజేపీ ఇస్తుంటే దేశం మొత్తం ఇవ్వచ్చు కదా?, సన్న బియ్యంతో తెలంగాణలో నిరుపేదలకు అసలైన పండుగను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. దేశ చరిత్రలో నిలిచిపోయే కుల గణన, బీసీ బిల్లు, ఎస్సీ వర్గీకరణ సన్న బియ్యంను కాంగ్రెస్ హయంలో అమలు అయ్యాయి' అని స్పష్టం చేశారు.

## లబ్ధిదారులతో సీఎం రేవంత్ సహపంక్తి భోజనం

-మొదటిపేజీ తరువాయి
చెప్పుకొచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ మండలం పంతంగిలో రేషన్ కార్డు లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేసిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి. ఈ మేరకు మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి.. గతంలో దొడ్డు బియ్యం పెట్టినప్పుడు దళారులు, రైస్ మిల్లర్లు మాత్రమే బాగుపడేవారని, ఇప్పుడు సన్నబియ్యంతో ఆ పరిస్థితి లేదన్నారు. ఎవరు ఎన్ని అపోహలు సృష్టించిన రానున్న రోజుల్లో ప్రభుత్వం చెప్పిన హామీలన్నీ నెరవేరుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## రాష్ట్రానికే తలమానికంగా మంచిర్యాల అభివృద్ధి




**మంచిర్యాలక్రైం :** మంచిర్యాల నియోజకవర్గాన్ని రా ష్ట్రానికే తలమానికంగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసా గర్‌రావు అన్నారు. ఆదివారం మంచిర్యాల సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనం తరం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే 50కోట్లతో చేప ట్టిన ఆసుపత్రి పనులు పూర్తి చేశామన్నా రు. మరో 250 కోట్లు త్వరలోనే మంజూ రవుతాయన్నారు. మంచిర్యాల నియోజక వర్గాన్ని విద్య, వైద్య రంగాల్లో మారుతు న్న పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఆసుపత్రిని 2027 జూన్ కల్లా అందుబాటులోకి తెస్తామన్నా రు. ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ పాత విగ్రహం ఉన్న చోట కొత్తగా 12ఫీట్ల ఎత్తుతో పార్లమెంట్ నమూనాపై అంబే ద్కర్ విగ్రహాన్ని, మహాప్రస్థానాన్ని ఈ నెల 14న ప్రారంభిస్తామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను, నాయకుల ను ప్రజలు మర్చిపోయారన్నారు. అందు వల్లే బీజేపీ నాయకులు నియో జకవర్గం లోని దండేపల్లిలో చక్కర్లు కొడుతున్నార ని విమర్శించారు. రాముడి పేరు చెప్పి ఓట్లు అడగడం మానుకోవాలన్నారు. అయోధ్య నిర్మించిన ప్రాంతంలోనే ఓడిపోయినప్పటికీ బీజేపీ నాయకులకు బుద్ధి రావడం లేదన్నారు. మతం కాదు మానవత్వం ఉండాలని మతంకంటే మానవత్వమే గొప్పదన్నారు. అభివృద్ధి సంక్షేమాలనే తాను నమ్ముకు న్నానని ప్రజల రుణం తప్పకుండా తీర్చు కుంటానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం అందిస్తుండడంతో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, భానేష్, బొలిశెట్టి కిషన్, దశరథం, కాటం రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# సమిష్టి డిమాండ్ తగ్గిపోతోంది

సాధారణంగా సమష్టి డిమాండ్ (మొత్తం డిమాండ్) అంటే ఒక నిర్దిష్ట ధర వద్ద, ఒక నిర్దిష్ట కాలంలో వస్తువులు, సేవలకు మార్పిడి చేయబడిన మొత్తం ద్రవ్యంగా వ్యక్తీకరించ్ బడుతుంది. మొత్తం డిమాండ్‌ను సాధారణంగా వినియోగం, పెట్టుబడి, ప్రభుత్వ వ్యయం, నికర ఎగుమతులు వంటి నాలుగు వనరుల మొత్తంగా వర్ణిస్తారు. ప్రపంచ సమష్టి డిమాండ్ తగ్గడానికి దోహదపడే ప్రధాన అంశాలుగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయం వంటి వి ఉన్నాయి. ప్రపంచ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, జీవన వ్యయ సంక్షోభం, ఇంధన ధరలు, వడ్డీ రేటు పెంపుదల, ప్రపంచ పరపతి కఠినత్వం, కొవిడ్ మహమ్మారి పరిణామాలు, లాజిస్టిక్స్ సవాళ్లు, ముడి పదార్థాల కొరత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, రష్యా- ఉక్రెయిన్ యుద్ధం, వాణిజ్య అనిశ్చితి మొదలైనవి మొత్తం డిమాండ్ తగ్గడానికి కారణమవుతున్నాయి. సమష్టి డిమాండ్ తగ్గడం వల్ల వాస్తవ స్థూల దేశీయోత్పత్తి, ఆర్థిక ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ప్రకారం 2025, 2026 సంవత్సరాల్లో ప్రపంచ వృద్ధి 3.3 శాతంగా అంచనా వేయబడింది, ఇది చారిత్రక (2000-19) సగటు 3.7 శాతం కంటే తక్కువ. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో మందగమనం ప్రపంచ డిమాండ్ బలహీనపడటానికి దోహదం చేస్తుంది. అమెరికా, యూరోపియన్ దేశాల నుండి చైనా, భారతదేశం, బ్రెజిల్ వరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు ద్రవ్యోల్బణం, వడ్డీరేటు పెంపుదల, ప్రపంచ సరఫరా గొలుసు అంతరాయాలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల మిశ్రమం కారణంగా తగ్గుతున్న సమష్టి డిమాండ్ సమస్యను ఎదుర్కొంటున్నాయి. అనేక ఇతర ఆర్థిక వ్యవస్థల మాదిరిగానే భారతదేశం కూడా తగ్గుతున్న మొత్తం డిమాండ్ ద్వారా గణనీయంగా ప్రభావితమవుతుంది. భారతదేశంలోమొత్తం డిమాండ్‌లో తగ్గుదల ప్రధానంగా తగ్గిన వినియోగం, తగ్గిన పెట్టుబడి, తగ్గుతున్న ప్రభుత్వ వ్యయం, బలహీనమైన నికర ఎగుమతుల నుండి వస్తుంది. ఏదేశమైనా దేశీయ వినియోగంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఇది దాని స్థూల దేశీయోత్పత్తిలో గణనీయమైన భాగాన్ని కలిగి ఉంటుంది. అందువల్ల, డిమాండ్‌లో ఏదైనా మందగమనం ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలలో భిన్న పరిణామాలను కలిగిస్తుంది. ఆర్థిక మాంద్యం, పేదరికం, అసమానత, రాజకీయ అస్థిరత, ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంపై ప్రభావం, నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎలు) వంటి విస్తృత ఆర్థిక పరిణామాల కారణంగా భారతదేశం తగ్గుతున్న మొత్తం డిమాండ్ ద్వారా తీవ్రంగా ప్రభావితమవుతుంది. ఈ ప్రభావాలు ఉపాధి నుండి వ్యాపార పెట్టుబడి, ఎగుమతులు, ఆర్థిక ఆరోగ్యం వరకు వివిధ రంగాలలో అలలు రేపుతాయి. భారతదేశంలో మొత్తం డిమాండ్‌ను ప్రభావితం చేసే కీలక అంశాలు చూసినపుడు ద్రవ్యోల్బణ ఒత్తిడి ఫిబ్రవరి 2025లో 3.6%. ఇది కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది, వినియోగాన్ని ప్రభావితం చేస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు ప్రతిస్పందనగా వడ్డీ రేట్లను పెంచింది, ఇది ప్రైవేట్ పెట్టుబడి, వినియోగాన్ని తగ్గించవచ్చు, ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో అమెరికా, చైనా మందగమనం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కోవిడ్ మహమ్మారి వంటి ప్రపంచ అంశాలు భారతదేశ ఎగుమతులు, పెట్టుబడి రాకపోకలు ద్రవ్యోల్బణంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. ప్రభుత్వ సంస్కరణలు వస్తువులు, సేవల పన్ను (జిఎస్‌టి), మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి నిర్మాణాత్మక సంస్కరణలు దేశీయ తయారీ, పెట్టుబడి ఎగుమతులను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే, వాటి పూర్తి ప్రభావాలు కార్యరూపం దాల్చడానికి సమయం పట్టవచ్చు. డిసెంబర్ 2024లో, భారత దేశంలో ప్రైవేట్ వినియోగం స్థూల దేశీయోత్పత్తిలో 64.8% వాటాను కలిగి ఉంది. కొవిడ్ మహమ్మారి తర్వాత గ్రామీణ భారతదేశం గణనీయమైన కోలుకుంది. అయినప్పటికీ పట్టణ ప్రాంతాలు ఇప్పటికీ మొత్తం వినియోగంలో ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయి. అయితే, వ్యవసాయ ఇబ్బందులు, ఆదాయ అసమానత ఇతర నిర్మాణాత్మక సవాళ్ల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగ వృద్ధి కొద్దిగా నెమ్మదిగా ఉంది. భారతదేశ రిటైల్ రంగం దేశ స్థూల దేశీయోత్పత్తికి దాదాపు 10% దోహదపడుతుంది. వచ్చే దశాబ్దంలో దాదాపు 9- 10% కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు (సిఎజిఆర్) వద్ద వృద్ధి చెందుతుందని అంచనా వేయబడింది, 2032 నాటికి దాదాపు %వి%2 ట్రిలియన్ల విలువను చేరుకుంటుంది. భారతదేశ వినియోగదారుల విశ్వాసం హెచ్చుతగ్గులకు లోనవుతోంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, అధిక ఇంధన ధరలు ఉపాధి ఆందోళనల కారణంగా 2024లో వినియోగదారుల ఆశావాదం తగ్గినట్లు నీల్సన్ ఐక్యూ వినియోగదారుల విశ్వాస సూచిక చూపించింది.సాంకేతికత, ఇ- కామర్స్, తయారీ వంటి రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రవాహాలు బలంగా ఉన్నాయి. 2024లో, ఏప్రిల్- డిసెంబర్ కాలంలో భారతదేశ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) 27% పెరిగాయి. అయితే, అధిక నిష్క్రమణల కారణంగా నికర ఎఫ్‌డిఐ తగ్గింది. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో, భారతదేశ ప్రభుత్వ వ్యయం 48.21 లక్షల కోట్లుగా అంచనా వేయబడింది, ఇది స్థూల దేశీయోత్పత్తి లో 19.4%.ఈ భాగాలలో ఏదైనా తగ్గుదల సమిష్టి డిమాండ్ తగ్గడానికి దారితీస్తుంది. మెరుగుపరచడానికి చర్యలు ఒక దేశం కేంద్రబ్యాంకు నియంత్రణలో ఉన్న ద్రవ్యవిధానం, రుణ వ్యయాలు, పెట్టుబడి, వినియోగదారుల ఖర్చులను ప్రభావితం చేయడం ద్వారా మొత్తం డిమాండ్‌ను నేరుగా ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు అమెరికాలోని ఫెడరల్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఇసిబి) ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరిచేందుకు వారి బెంచ్‌మార్క్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ జపాన్ గతంలో ప్రతికూల వడ్డీ రేట్లతో ప్రయోగాలు చేశాయి. ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌ను ప్రత్యక్షంగా ప్రభావితం చేయడానికి ప్రభుత్వాలు ఆర్థిక విధానాన్ని ఉపయోగించవచ్చు. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్, 2021 అమెరికా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బిల్లు వంటి పెద్ద-స్థాయి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు మొత్తం డిమాండ్‌ను పెంచే లక్ష్యంతో ఆర్థిక ఉద్దీపన ప్రకటించాయి. కోవిడ్ మహమ్మారి సమయంలో అమెరికా నిరుద్యోగ బీమా ప్రయోజనాలు, అలాగే స్పెయిన్, ఫిన్లాండ్ వంటి దేశాలలో యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ (యుబిఐ) చర్చలు ఇందుకు ఉదాహరణలు. ఇటీవల, చైనా భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, మొత్తం డిమాండ్‌ను పెంచడానికి మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవడానికి ఒక ఉదాహరణ.

# ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో తెలుగు వారి భాగస్వామ్యం



తొమ్మిది దశాబ్దాల క్రితం 1930 ఏప్రిల్ 6 న మహాత్మా గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించి, వేలాది మందితో నిరసన తెలిపి, లక్షలాది మందిని చైతన్య పరిచిన సంఘటన. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసి స్ఫూర్తిని కల్పించిన మరిచి పోలేని నేపథ్యం. భారత దేశ స్వాతంత్ర్య సమర చరిత్రలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లంఘనలో భాగంగా, మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెసు జరిపిన అహింసాయుత సత్యాగ్రహమే ఉప్పు సత్యాగ్రహం. అది మహాత్మా గాంధీచే ప్రారంభించ బడిన ఒక అహింసా ప్రచారోద్యమం. ఇది బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా జరిగింది. ఉప్పుపై పన్ను చెల్లిం చేందుకు నిరాకరించి, మార్చి 12, 1930న చేప ట్టిన దండి యాత్రనే ఉప్పు సత్యాగ్రహంగా పేర్కొంటారు. సంపూర్ణ స్వరాజ్యం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్య మాల సారమే ఈ ఉప్పు సత్యాగ్రహం. ఈ యాత్ర సబర్మతి ఆశ్రమం నుంచి ఎనభై మందితో ప్రారంభమై గుజరాత్ లోని సముద్ర తీరంలో ఉన్న పల్లెటూరు దండి వరకూ సాగింది. కనుక దీనికి ఉప్పు సత్యాగ్రహ కార్యక్రమంగా పేర్కొంటారు. కోట్లమంది భారతీయులపై బ్రిటిష్ రాజ్ వేసే ఉప్పు పన్నుకు వ్యతిరేకించిన మౌన నిరసన కార్యక్రమం అది. దానిని దండి సత్యాగ్రహం అనీ, దండి యాత్ర అనీ, దండి మార్చ్ అనీ పిలుస్తారు. 1920 - 22 నాటి సహాయ నిరాకరణోద్యమం తరువాత ఈ మార్చ్ బ్రిటిష్ అధికారానికి అత్యంత ముఖ్యమైన వ్యవస్థీకృత సవాలు విసిరింది. 1930 జనవరి 26 న భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్య నినాదం ప్రకటించిన వెంటనే దండి సత్యాగ్రహం మొదలైంది. ఉప్పు పన్ను బ్రిటిష్ రాజ్ పన్ను ఆదాయంలో 8.2% వరకూ ఉంటుంది. పేద భారతీయులకు చాలా భారంగా ఉండే పన్ను ఇది. ఉప్పు తయారీనే నిరసనకు, సత్యాగ్రహానికి తాను ఎందుకు ఎంపిక చేసిందీ వివరిస్తూ గాంధీ... “గాలి, నీరూ... ఆ తరువాత బహుశా ఉప్పే జీవితానికి అత్యవసరం” అని అని పేర్కొన్నారు. ఉప్పు చట్టాలను ధిక్కరించడం ద్వారా గాంధీ శాసనోల్లంఘనను ప్రారంభిస్తారని ఫిబ్రవరి 5 న వార్తా పత్రికలు రాసాయి. ఉప్పు సత్యాగ్రహం మార్చి 12 న అహ్మదాబాదు లోని సబర్మతి ఆశ్రమంలో ప్రారంభమై ఏప్రిల్ 6 న దండిలో ముగుస్తుందని పత్రికలు పేర్కొన్నాయి. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసారు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగ పడింది. మహాత్మా గాంధీ తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సత్యాగ్రహం ప్రారంభానికి కొన్నిరోజుల కు ముందే బ్రిటిష్ వారు గాంధీని మార్చి 5, 1930 న అరెస్టు చేశారు. ఈ సత్యాగ్రహం దాదాపు ఒక సంవత్సర కాలం నడిచింది. ఈ సత్యాగ్రహం మూలంగా దాదాపు 80,000 వేలకు పైగా భారతీయులు కారాగారాల పాలయ్యారు. లక్షల కొద్దీ భారతీయులు స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. దండి మార్చిలో మహాత్ముడితో పాటు 79 మంది అనుచరులు పాల్గొన్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి దండి మార్చిలో గాంధీతో పాటు నడిచిన ఏకైక తెలుగు వ్యక్తి యెర్నేని సుబ్రహ్మణ్యం. తర్వాత కాలంలో ఆయన గాంధీ సిద్ధాంతాలతో కొమరవోలులో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. నెల్లూరులో ఉప్పు సత్యాగ్రహం నిర్వహించిన దండు నారాయణ రాజును నాటి ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెట్టడంతో ఆయన అక్కడే మరణించారు. ఉప్పు సత్యాగ్రహం సమయం లోనే ‘కవిరాజు’ త్రిపురనేని రామస్వామి చౌదరి... “వీర గంధము తెచ్చినారము వీరులెవ్వరొ తెల్పుడి” అనే గేయ కవితను రాశారు. మాక్సిం గోర్కీ రాసిన రష్యన్ నవల ‘ది మదర్’ను ‘అమ్మ’ పేరుతో తెలుగులోకి అనువదించిన క్రొవ్విడి లింగరాజు ఈ ఉద్యమ సమయంలోనే దేశద్రోహం నేరంపై జైలుకెళ్లారు. బ్రహ్మ జోస్యుల సుబ్రహ్మణ్యం సీతానగర ఆశ్రమాన్ని స్థాపించారు. దీన్నే ‘ఆంధ్రా దండి’గా పిలుస్తారు. ఉప్పు సత్యాగ్రహం సందర్భం లోనే కేంద్ర శాసన సభకు రామదాసు పంతులు, శాసన మండలి సభ్యత్వానికి స్వామి వెంకటాచలం రాజీనామాలు చేశారు. ఉప్పు చట్టాలను ఉల్లఘించి బులుసు సాంబమూర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ ( మాలపల్లి నవల రచయిత), ఖాసా సుబ్బారావు లాఠీ దెబ్బలు తిన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసులోని తన నివాసం వేదవనంలో సత్యాగ్రహ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశాఖ పట్నంలో తెన్నేటి విశ్వనాథం, మచిలీ పట్నంలో అయ్యదేవర కాళేశ్వరరావు, రాయలసీమ పరిధిలో కల్లూరి సుబ్బారావు ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు. నెల్లూరులోని మైపాడు బీచ్‌లో బెజవాడ గోపాలరెడ్డి ఉప్పు తయారు చేసి ప్రజలకు అమ్మారు. అలా లక్షలాది మంది తమ సొంత ఉప్పును తయారు చేసుకున్నారు.

# బంగ్లా తీరు మారాల్సిందే!



ఏదైనా మోతాదు మించితే వికటిస్తుంది. ఆశించిన ఫలితం రాకపోగా అనవసర ప్రయాస మిగులు తుంది. బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్‌కు ఆలస్యంగానైనా ఇది అర్థమైందో లేదో సందేహమే. గతవారం ఆయన చైనా పర్యటనకు వెళ్లారు. ఆ పర్యటన విజయవంతమైందని బంగ్లా ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంది. కానీ అక్కడ తెలిసీ తెలియకుండా యూనస్ మాట్లాడిన మాటలవల్ల బంగ్లాకు ఒరిగిందేమీ లేకపోగా, ప్రధాని నరేంద్ర మోదీతో చెప్పించుకోవాల్సివచ్చింది. నిరుడు ఆగస్టులో ప్రజా ఉద్యమం పర్యవసానంగా అప్పటి బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా పదవి కోల్పోయి మన దేశంలో ఆశ్రయం పొందినప్పటినుంచీ ఇరు దేశాల సంబంధాలూ దెబ్బతిన్నాయి. అక్కడ మైనారిటీ హిందువులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయి. హత్యలు, అత్యా చారాలు అధికమయ్యాయి. మత ఛాందసవాదుల ప్రాబల్యం ఎక్కువైంది. ఈ పరిణామాల అనంతరం ఇరు దేశాలమధ్యా ఉన్నతస్థాయి భేటీ జరగటం ఇదే ప్రథమం. శు క్రవారం థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో జరిగిన ఏడు దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాల కూటమి బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా యూనస్‌తో విడిగా భేటీ అయినప్పుడు ఉద్రిక్తతలు పెంచే ప్రకటనలు చేయటం మానుకోవాలని మోదీ సూచించినట్టు చెబుతున్నారు. ద్వైపాక్షిక సంబంధాలు మెరుగు పడాలంటే నిర్మాణాత్మక, ఆచరణీయ వైఖరితో ఉండాలని కూడా సలహా ఇచ్చారట. తమ దేశంపై తప్పుడు ప్రచారం సాగుతోందని బంగ్లా దబాయించినా సామాజిక మాధ్యమాల్లోని వీడియోలు నిజమేమిటో వెల్లడిస్తూ వచ్చాయి. వీటిపై విచారణ జరిపించి బాధ్యులైన వారిని అరెస్టు చేయాలని, ఇవి పునరావృతం కానీయరాదని గతంలోనే మన దేశం డిమాండ్ చేసింది. ప్రస్తుత భేటీలో కూడా మోదీ దీన్ని లేవనెత్తారు. మాజీ ప్రధాని హసీనాను అప్పగించాలన్న యూనస్‌కు... అలా అడగటా నికి ఇది వేదిక కాదని మన విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ చెప్పాల్సి వచ్చింది. యూనస్ పూర్వాశ్రమంలో ఆర్థిక శాస్త్ర ఆచార్యుడు. గ్రామీణ బ్యాంకు వ్యవస్థ రూపశిల్పిగా, మైక్రో ఫైనాన్స్ విధాన నిర్ణేతగా బంగ్లా గ్రామీణ ప్రజల జీవనాన్ని మెరుగుపరిచేందుకు చేసినకృషికి 2006లో ఆయనకు నోబెల్ శాంతి పురస్కారం లభించింది. పలు ఐక్యరాజ్యసమితి అనుబంధ సంఘాలకు సారథ్యం వహించారు. ఇదంతా బాగున్నా షేక్ హసీనాతో వచ్చిన విభేదాల కార ణంగా ఆయనకు కష్టాలు మొదలయ్యాయి. కేసులు వచ్చి పడ్డాయి. మైక్రో ఫైనాన్స్ వ్యవస్థ వల్ల గ్రామీణులకు మేలు కలగకపోగా అప్పుల్లో కూరుకుపోయారన్న ఆరోపణలూ వచ్చాయి. తనకు ససేమిరా పడని హసీనాకు మన దేశం మద్దతుగా నిలిచిందన్న ఆక్రోశం యూనస్‌కు ఉండొచ్చు. ఇరుగు పొరుగు సత్సంబంధాలతో మెలగటం, ఇచ్చిపుచ్చుకోవటం, అభివృద్ధి సాధించటం అత్యవసరమని ఆయన ఇప్పటికీ గ్రహించలేదని చైనాలో ఆయన చేసిన వ్యాఖ్యలు చెబుతున్నాయి. ఈశాన్య భారత్‌లోని ఏడు రాష్ట్రాలూ సముద్రతీరం లేనివని, కనుక ఈ ప్రాంతంలో అందరూ తమపై ఆధారపడక తప్పదని యూనస్ చైనాలో వ్యాఖ్యానించారు. అక్కడితో ఆగలేదు. మౌలిక సదుపాయాలూ, కనెక్టివిటీ సరిగాలేని ఈ ప్రాంతంలో పెట్టుబడులకు భారీ అవకాశాలున్నాయని చైనాకు గుర్తుచేశారు. అది తెలివితక్కువతనమో, మతిమరుపోగానీ... భారత్‌కు రెండువైపులా 6,500 కిలోమీటర్ల పొడవైన విస్తృత తీరప్రాంతం ఉందన్న సంగతి ఆయనకు తట్టలేదు. ఈశాన్యంలో రహదారులు, రైల్వే నిర్మాణం మరింత మెరుగుపరిస్తే... జలరవాణాను పెంచితే దేశంలోని ఏ తీరప్రాంతంనుంచి అయినా విదేశాలకు ఎగుమతులు చేయటం ఎంత పని! యూనస్ వ్యాఖ్యల్ని అపార్థం చేసుకున్నారని బంగ్లా విదేశాంగ శాఖ ముక్తాయిస్తోంది. కానీ సమయమూ,సందర్భమూ గమనిస్తే అది నిజం కాదనిపిస్తుంది. తాము పాకిస్తాన్‌తోపాటు చైనాకు దగ్గర కాబోతు న్నామని మన దేశాన్ని నేరుగా హెచ్చరించటమే ఇది. బంగ్లాదేశ్‌కు ఆర్థిక కష్టాలు దండిగానే ఉన్నాయి. అందులో కొన్ని స్వయంకృతం. బంగ్లాకు ఇచ్చే ఆర్థిక సాయాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిలిపేశారు. హసీనా పదవీచ్యుతి తర్వాత అక్కడ మతఛాందసుల వీరంగంతో మన దేశం కూడా బంగ్లాను దూరం పెట్టింది. దాంతో నిధుల లేమితో అది సతమతమవుతోంది. ఇటీవల బియ్యం కొరత ఏర్పడి అది పాకిస్తాన్‌ను ఆశ్రయించినా అక్కడినుంచి చాలినంత అందలేదు. పైగా భారత్‌నుంచి వచ్చే బియ్యంతో పోలిస్తే వ్యయం తడిసి మోపెడవుతోంది. ప్రధాన సలహాదా రయ్యాక యూనస్‌ను మన ప్రభుత్వం అభినందించినా, భారత్‌లో పర్యటించాలని ఆహ్వానం పంపలేదు. అందుకే తొలి పర్యటనకు యూనస్ కావాలని చైనాను ఎంచుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే చైనాను ఆకాశానికెత్తి మనల్ని చిన్నబుచ్చే యత్నం చేశారు. ఇంతచేసినా 210 కోట్ల డాలర్ల పెట్టుబడికి చైనా సమ్మతించింది. దాదాపు వంద కంపెనీలు 100 కోట్ల డాలర్లమేర మదుపు చేయటానికి అంగీకరిం చాయి. ఈ రెండు ప్రతిపాదనలకూ నిర్దిష్ట గడువు లేదు. ఎప్పుడొస్తాయో తెలియదు. కానీ బంగ్లాకు తక్షణసాయం కావాలి. అది అధిక ధరలతో, నిత్యావసరాల కొరతతో సతమతమవుతోంది. మత ఛాందసులు ఈ స్థితిని తమకు అను కూలంగా మలుచుకునే పనిలో ఉన్నారు. మోదీ అన్నట్టు సుస్థిర, ప్రజాతంత్ర, శాంతియుత దేశ మన్న అభిప్రాయం కలిగించినప్పుడే బంగ్లాకు అన్నివైపులనుంచీ సాయం అందుతుంది. అరాచక శక్తులకు ఆటపట్టయితే, భారత్ వ్యతిరేకతే ఊపిరిగా బతుకుతానంటే ప్రయోజనం శూన్యం. యూనస్ ఈ సంగతిని ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

Follow:
subhatelangana
శుభ తెలంగాణ
సోమవారం 7 | మేడ్చల్
7 ఏప్రిల్ 2025
www.subhatelangana.in


# లక్ష్మీదేవిని ఆకర్షించే ముఖ్యమైన వస్తువులు!



ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో సంతోషం, సంపదలు నిండాలని ఆశిస్తారు. వాస్తు శాస్త్రం ప్రకారం కొన్ని ప్రత్యేకమైన వస్తువులను ఇంట్లో ఉంచడం ద్వారా అదృష్టాన్ని ఆకర్షించవచ్చు. ఇవి ప్రతికూల శక్తిని తొలగించి ఆర్థిక స్థిరతను కలిగిస్తాయి. ఇంట్లో ధనలక్ష్మిని ఆకర్షించేందుకు ఈ 9 వాస్తు వస్తువులను ఉంచడం ఎంతో శ్రేయస్కరం. ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో శాంతి, సంపదలు నిలిచి ఉండాలని కోరుకుంటారు. అయితే కొన్ని ప్రత్యేకమైన వస్తువులను ఇంట్లో ఉంచడం ద్వారా అదృష్టాన్ని ఆకర్షించవచ్చని వాస్తు శాస్త్రం చెబుతోంది. ఇవి నెగటివ్ ఎనర్జీని తొలగించి సానుకూల శక్తిని పెంచడమే కాకుండా ఆర్థికంగా స్థిరతను కలిగిస్తాయని నమ్మకం. ఇంట్లో ధనలక్ష్మి కటాక్షానికి ఈ 9 వస్తువులు తప్పనిసరిగా ఉండాలి. నెమలి ఈకలు ఎంతో పవిత్రమైనవని శాస్త్రాలు చెబుతున్నాయి. ఇంట్లో వీటిని ఉంచడం వల్ల ప్రతికూల శక్తి తొలగిపోతుందని నమ్మకం. ప్రత్యేకంగా నెమలి ఈకలను పూజ గదిలో ఉంచి ప్రతిరోజూ భగవంతుడిని ఆరాధిస్తే ఇంట్లో సుఖసంపత్తులు పెరుగుతాయని చెబుతారు. ఇంట్లో తూర్పు దిశలో లాఫింగ్ బుద్ధ విగ్రహాన్ని ఉంచడం చాలా శుభప్రదంగా ఉంటుంది. ఇది ఇంట్లో ఆనందాన్ని, ఆర్థికాభివృద్ధిని పెంచేందుకు సహాయపడుతుంది. ధనలక్ష్మిని ఆకర్షించేందుకు లాఫింగ్ బుద్ధను పెట్టడం మంచి ఫలితాలు ఇస్తుందని వాస్తు నిపుణులు సూచిస్తున్నారు. చిన్న తాబేలు విగ్రహాన్ని ఇంట్లో ఉంచడం వల్ల ధనసంపత్తి పెరుగుతుందని నమ్మకం. ముఖ్యంగా ఇది వ్యాపారం చేసే వారికి ఎంతో లాభదాయకం. వాస్తు ప్రకారం తాబేలు శక్తిని నిలిపే స్వభావం కలిగి ఉండటంతో దీన్ని ఇంట్లో ఉంచడం ద్వారా ఆర్థికంగా స్థిరత లభిస్తుంది. లక్ష్మీదేవి చిత్రాన్ని ఇంట్లో ఈశాన్య దిశలో ఉంచితే శుభశక్తి ప్రవహించి ఇంట్లో ధనసంపత్తి నిలుస్తుందని చెబుతారు. ఇది మాత్రమే కాకుండా ప్రతి శుక్రవారం లక్ష్మీదేవికి విశేష పూజలు చేస్తే ఆర్థిక సమస్యలు తొలగిపోతాయని నమ్మకం.గవ్వలను పూజా స్థలంలో లేదా డబ్బులు నిల్వ చేసే చోట ఉంచితే అఖండ ఐశ్వర్యం కలుగుతుందని చెబుతారు. వ్యాపారస్తులు క్యాష్ కౌంటర్‌లో ఉంచితే ఇది అదనపు లాభాలను తెస్తుందని నమ్ముతారు.పచ్చ కర్పూరం దహనం చేయడం ద్వారా ఇంట్లోని ప్రతికూల శక్తి తొలగిపోతుందని అదృష్టం మెరుగవుతుందని నమ్ముతారు. ప్రతి శుక్రవారం పచ్చ కర్పూరంతో హారతి ఇస్తే ఇంట్లో సుఖసంతోషాలు పెరుగుతాయని వాస్తు నిపుణులు సూచిస్తున్నారు. తులసి మొక్కను ఇంట్లో నాటడం ద్వారా సానుకూల శక్తి పెరుగుతుందని చెబుతారు. లక్ష్మీదేవి కటాక్షం లభించాలంటే తులసిని ప్రతిరోజూ పూజ చేసి దీపారాధన చేయడం శ్రేయస్కరం. ఇంట్లో లోహపు వినాయకుడి విగ్రహాన్ని ఉంచడం ద్వారా ప్రతికూల శక్తి తొలగిపోతుందని శుభశక్తులు పెరుగుతాయని నమ్ముతారు. ఇది ముఖ్యంగా కొత్త వ్యాపారాన్ని ప్రారంభించే వారికి మంచిదని వాస్తు నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి ప్రధాన ద్వారానికి మామిడాకుల తోరణాన్ని కడితే శుభశక్తి ప్రవహిస్తుందని చెబుతారు. ఇంటి ప్రధాన ద్వారం వద్ద తులసి నీటితో నిండిన కలశాన్ని ఉంచితే శుభశక్తులు ప్రవహించి ఇంట్లో సౌభాగ్యం నిలుస్తుందని నమ్ముతారు. ప్రతి శుక్రవారం పూజా గదిలో యాలకులు, కర్పూరం కలిపి వెలిగించి లక్ష్మీదేవికి హారతి ఇవ్వాలి. ఆ పొగను ఇంట్లో చూపించడం వల్ల ఇంట్లో శుభశక్తులు పెరిగి కష్టాలు తొలగిపోతాయని నమ్మకం. ఈ వాస్తు చిట్కాలను పాటించి ఇంట్లో ధనసంపత్తిని పెంచుకునే ప్రయత్నం చేయండి.

# మెనోపాజ్‌లో చర్మం తాజాగా ఉండాలంటే..!




మెనోపాజ్ దశలో చర్మం అనేక మార్పులకు గురవుతుంది. హార్మోన్ల అసమతుల్యత వల్ల చర్మం పొడిబారడం, ముడతలు, మొటిమలు వంటి సమస్యలు వస్తాయి. సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్యలను తగ్గించుకోవచ్చు. 45 ఏళ్ల తరువాత మహిళల హార్మోన్ల స్థాయిల్లో మార్పులు రావడం వల్ల పీరియడ్స్ పూర్తిగా ఆగిపోతాయి. ఈ దశను మెనోపాజ్ అని అంటారు. మెనోపాజ్ సమయంలో శరీరంలో జరిగే మార్పులు అనేక రకాల ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడతాయి. ముఖ్యంగా చర్మంపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. చర్మం పొడిబారడం, ముడతలు ఏర్పడటం, కొందరికి మొటిమలు రావడం, అవాంఛిత రోమాల పెరుగుదల వంటి సమస్యలు ఎదురవుతాయి. అయితే సరైన జాగ్రత్తలు తీసుకుంటే చర్మాన్ని మృదువుగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. ఈ దశలో ఎస్ట్రోజెన్ స్థాయిల్లో అనేక మార్పులు జరుగుతాయి. ఎస్ట్రోజెన్ తక్కువగా ఉ?ండటం వల్ల చర్మం తేమ కోల్పోయి పొడిగా మారుతుంది. కొందరికి ముఖంపై ముడతలు వస్తాయి. కొందరికి మొటిమలు రావడం, ఫైన్లైన్స్ కనిపించడం వంటి సమస్యలు కనిపిస్తాయి. వీటిని నివారించేందుకు సరైన చర్మ సంరక్షణ పద్ధతులను పాటించాలి.మెనోపాజ్ సమయంలో చర్మం పొడిగా మారడంతో పాటు సూర్యరశ్మి ప్రభావానికి కూడా అధికంగా గురవుతుంది. అందుకే ఎస్పీఎఫ్ 30 లేదా అంతకంటే ఎక్కువ ఉన్న సన్‌స్క్రీన్‌ను తప్పనిసరిగా వాడాలి. బయటకు వెళ్లే ముందు దీనిని ముఖానికి, మెడకు అప్లై చేస్తే చర్మానికి రక్షణ కలుగుతుంది.మెనోపాజ్ సమయంలో చర్మం తేమ కోల్పోయి పొడిగా మారుతుంది. దీని వల్ల ముడతలు త్వరగా రావచ్చు. అందుకే తగిన మాయిశ్చరైజర్‌ను వాడడం చాలా అవసరం. హైలూరోనిక్ యాసిడ్, గ్లిజరిన్, సెరామైడ్లు వంటి చర్మానికి తేమను అందించే పదార్థాలు ఉండే మాయిశ్చరైజర్లు ఉపయోగిస్తే చర్మం మృదువుగా ఉంటుంది.కొంతమందికి మెనోపాజ్ సమయంలో చర్మం ఎర్రగా మారడం, మంట ఉండడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అలాంటి వారందరికీ కలబంద జెల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇది చర్మానికి తేమను అందించడమే కాకుండా శీతలతను కూడా ఇస్తుంది. కొందరికి గ్రీన్ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు కూడా బాగా సహాయపడతాయి. హార్మోన్ల మార్పుల కారణంగా కొందరికి మెనోపాజ్ సమయంలో ముడతలు, ఫైన్లైన్స్ కనిపించడం ప్రారంభమవుతుంది. దీన్ని తగ్గించేందుకు రెటినాయిడ్ క్రీములను వాడాలి. రెటినాయిడ్స్ విటమిన్ ఎ ఆధారిత పదార్థాలు కావడంతో చర్మ కణాల పునరుద్ధరణకు సహాయపడతాయి. మెనోపాజ్ సమయంలో కొందరికి ముఖంపై అవాంఛిత రోమాలు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా పై పెదవి ప్రాంతాల్లో అవి ఎక్కువగా కనిపించవచ్చు. దీనిని తొలగించేందుకు థ్రెడ్డింగ్, వ్యాక్సింగ్ లేదా లేజర్ ట్రీట్మెంట్ లాంటి పద్ధతులను ఫాలో అవ్వచ్చు. మెనోపాజ్ సమయంలో చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే తగినంత పోషకాహారం తీసుకోవాలి. విటమిన్ ఇ, విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు తినడం వల్ల చర్మానికి తగినంత పోషణ లభిస్తుంది. రోజుకు కనీసం 8-10 గ్లాసుల నీరు తాగడం ద్వారా చర్మానికి తేమను అందించవచ్చు. మెనోపాజ్ కారణంగా కొందరికి నిద్ర లేమి సమస్య ఏర్పడుతుంది. సరైన నిద్ర లేకపోతే చర్మ ఆరోగ్యం కూడా ప్రభావితమవుతుంది. అందుకే ప్రతిరోజూ కనీసం 7-8 గంటల నిద్రను తీసుకోవడం అవసరం.

## మెషిన్ కాఫీ తాగేవారిలో
# పెరుగుతున్న ఆ ముప్పు




స్వీడన్‌లోని ఉప్సాలా విశ్వవిద్యాలయం చల్మర్స్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం పరిశోధకులు ఈ విషయంపై కొత్త అధ్యయనం చేశారు. ఈ ఫలితాలు 'న్యూట్రిషన్, మెటాబాలిజం ఢ కార్డియోవాస్క్యులర్ డిసీజెస్' అనే అంతర్జాతీయ పత్రికలో ప్రచురితమయ్యాయి. వారు 14 రకాల ఆఫీస్ కాఫీ మెషిన్‌ల నుంచి తీసిన కాఫీ నమూనాలను పరిశీలించగా, మెషిన్ రకం ఆధారంగా కాఫీలో కొలెస్ట్రాల్ పెంచే అంశాల స్థాయిలో గణనీయమైన తేడా కనిపించింది. ఒకే మెషిన్‌లో కూడా వివిధ సమయాల్లో ఈ స్థాయిలు మారుతున్నట్లు గుర్తించారు. ఆఫీసులో కాఫీ లేని ఒక్క రోజును ఊహించడం కష్టమా? ఉదయం పని ఒత్తిడి ఎక్కువైనప్పుడు లేదా మధ్యాహ్నం అలసట ఆవహించినప్పుడు, కాఫీ తాగితేనే ఉత్సాహం వస్తుందని భావించే ఉద్యోగులు ఎందరో ఉన్నారు. కానీ, మీ డెస్క్ దగ్గరే ఉన్న కాఫీ మెషిన్‌లో తయారైన ఆ కాఫీ మీ ఆరోగ్యానికి హాని కలిగించవచ్చని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా, రోజూ ఆఫీస్ కాఫీ తాగే వారిలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగే ప్రమాదం ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాఫీలో సహజంగా ఉండే 'కఫెస్టోల్' మరియు 'కాహ్వియోల్' అనే రెండు రసాయనాలు కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయని పరిశోధకులు తెలిపారు. ఇవి రక్తంలో ఎల్ డీఎల్ (చెడు కొలెస్ట్రాల్) పెరిగేలా చేస్తాయి. ముఖ్యంగా, ఎక్కువగా ఉడకబెట్టిన కాఫీలో ఈ రసాయనాలు అధికంగా ఉంటాయి. అందుకే నార్డిక్ దేశాల్లో ఉడికించిన కాఫీని తక్కువగా తీసుకోవాలని ఆహార మార్గదర్శకాలు సిఫార్సు చేస్తున్నాయి. డ్రిప్-ఫిల్టర్ కాఫీ మెషిన్‌లు వాడితే, కాఫీలో ఈ హానికర రసాయనాలు తక్కువగా ఉంటాయని తేలింది. ఎందుకంటే, పేపర్ ఫిల్టర్ ఈ పదార్థాలను సమర్థవంతంగా తొలగిస్తుంది. అయితే, కొన్ని ఆఫీస్ కాఫీ మెషిన్‌లు ఈ ఫిల్టరింగ్ ప్రక్రియను సరిగా చేయలేకపోతున్నాయని ఈ అధ్యయనం వెల్లడిస్తోంది. "రోజుకు 3-4 కప్పుల కాఫీ తాగే ఉద్యోగులు తమ కొలెస్ట్రాల్ స్థాయిలపై దృష్టి పెట్టాలి. ఆఫీసులో పేపర్ ఫిల్టర్‌తో కూడిన కాఫీ మెషిన్‌లను ఉపయోగిస్తే ఈ ప్రమాదాన్ని తగ్గించవచ్చు" అని పరిశోధకులు సలహా ఇస్తున్నారు. ఎందరో ఉద్యోగుల రోజు కాఫీతోనే ప్రారంభమవుతుంది. కానీ, అదే కాఫీ మీ గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని మర్చిపోకూడదు. ఆరోగ్యం కోసం పేపర్ ఫిల్టర్ కాఫీకి మారడం మంచి ఎంపిక. ఎందుకంటే, రోజూ తాగే ఆఫీస్ కాఫీ మీ శరీరంపై దీర్ఘకాలిక ప్రభావం చూపవచ్చు.

# మీ పేరు '�O' లెటర్‌తో ప్రారంభం అవుతుందా..!



ఒక్కొక్కరి వ్యక్తిత్వం ఒక్కోలా ఉంటుంది. మరీ ముఖ్యంగా పేరును బట్టి కూడా వారి ప్రవర్తన వేరుగా ఉంటుంది అంటారు. అయితే పేరును బట్టి వ్యక్తిత్వం చెప్పడం అనేది అంత సులభం కాదు. ప్రతి పేరులోని మొదటి అక్షరం అనేది ఆ వ్యక్తి వ్యక్తిత్వం, వారి ఇష్టాయిష్టాలు, వారి జీవితం గురించి తెలియజేస్తుంది. O అనే లెటర్ తో పేరు ప్రారంభమయ్యే వ్యక్తులు విశాల దృక్పథం కలిగి, స్నేహపూర్వకంగా ఉంటారు. ఇతరులతో ఎక్కువ సేపు ఆనందంగా గడపడానికి ఇష్టపడతారు. వీరికి ఇతరులను ఆకర్షించే సహజ సామర్థ్యం ఉంటుంది. అంతే కాదు, వారు తమ చుట్టూ చాలా మంది ఉండటాన్ని ఇష్టపడతారు. వారు ఇతరులు చెప్పేది ఓపికగా, ప్రశాంతంగా వింటారు. 'O' అక్షరంతో పేర్లు ప్రారంభమయ్యే వ్యక్తులు చాలా రొమాంటిక్ గా ఉంటారు. అంతే కాదు, వారు అన్ని సంబంధాలను భావోద్వేగ పరంగా కొనసాగిస్తారు. వాళ్ళు తమ భావాలను వ్యక్తపరచడంలో ముందుంటారు. అంతేకాకుండా వారు తమ జీవిత భాగస్వామి పట్ల ప్రేమ, అనురాగం ఉంటుంది. 'O' అక్షరంతో పేర్లు ప్రారంభమయ్యే వ్యక్తులు ఏ రంగంలోనైనా రాణిస్తారు. వారు సహజంగానే కష్టపడి పనిచేసేవారు. సృజనాత్మక ఉద్యోగాలు, కళా రంగాల పట్ల ఆసక్తి ఎక్కువ ఉంటుంది. వారు తమను తాము వ్యక్తీకరించుకునే సహజ సామర్థ్యాన్ని కలిగి ఉంటారు కాబట్టి, కళలు చాలా అనుకూలమైన రంగం అవుతుంది. అంతే కాదు, వారు ఏ సమస్యనైనా సులభంగా పరిష్కరించుకుంటారు. తమ లక్ష్యాన్ని సాధించడానికి వారు ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంటారు. 'O' ఎస్ లెటర్ తో పేరు ప్రారంభమయ్యే వారు డిజైనర్, ఆర్ట్ థెరపిస్ట్, ఫ్యాషన్ డిజైనర్, గ్రాఫిక్, నవల రచయిత, మ్యూజిషియన్, ఎగ్జిబిషన్ డిజైనర్, మేకప్ ఆర్టిస్ట్, క్రియేటివ్ రైటర్, ఆర్ట్ డైరెక్టర్, మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్, డేటా సైంటిస్ట్, డేటా అస్యూరెన్స్ స్పెషలిస్ట్, ఫోరెన్సిక్ స్పెషలిస్ట్, సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, పేటెంట్ అటార్నీ, బయోమెడికల్ ఇంజనీర్ టెక్నికల్ రైటర్ వంటి ఉద్యోగాల్లో పనిచేస్తారు. 'O' అక్షరంతో పేర్లు ప్రారంభమయ్యే వ్యక్తులు కొన్ని ప్రతికూల లక్షణాలను కలిగి ఉంటారు. ఇది వారి అతిపెద్ద బలహీనత అని కూడా చెప్పవచ్చు. కొన్నిసార్లు వారు మార్పును సులభంగా ఎదుర్కోలేరు లేదా మార్పును అస్సలు కోరుకోరు. వీరంత మొండి పట్టుదలగలవారు మరెవరూ లేరు. కొన్నిసార్లు పరిస్థితులను ఆలోచించకుండా తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటారు.

# అయోధ్య రామయ్యకు ఇష్టమైన ప్రసాదం



శ్రీరామ నవమి అనేది హిందూ మతంలో పవిత్రమైన పండుగ. ఈరోజు భక్తులు రాముడికి ఇష్టమైన నైవేద్యంగా అన్నం పాయసం సమర్పిస్తారు. శ్రద్ధతో తయారు చేసిన ఈ మధురమైన వంటకం భగవంతుడిని ప్రసన్నం చేస్తుందని నమ్మకం. భారతదేశవ్యాప్తంగా శ్రీరామ నవమిని ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. హిందూ సంప్రదాయాల్లో రాముని జన్మదినమైన ఈ రోజుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. పురాణాల ప్రకారం చైత్ర మాస శుక్ల పక్ష నవమి తిథినాడు శ్రీరాముడు అవతరించారని చెబుతారు. అందుకే ప్రతి సంవత్సరం ఈ తిథిని రామ నవమిగా జరుపుకుంటారు. కొందరు భక్తులు అయోధ్యలో రాముని దర్శనం చేసుకునేందుకు వెళ్తుంటే.. మరికొందరు ఇంట్లోనే రాముని జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అంతా బాగా చేసి ఆ శ్రీరాముడికి ఇష్టమైన వంట చేయకుంటే ఎలా. ఇవాళ మనం శ్రీరాముడికి ఎంతో ఇష్టమైన అన్నంతో చేసే పాయసంను ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకుందాం.

కావాల్సిన పదార్థాలు: బియ్యం - 1/2 కప్పు/ పాలు - 4 కప్పులు/ చక్కెర - 1/2 కప్పు/ యాలకుల పొడి - 1/2 టెంచా/ బాదం, కాజు, పిస్తా, కిస్మిస్ లు - తగినన్ని

తయారీ విధానం: ముందుగా బియ్యాన్ని శుభ్రంగా కడిగి 20 నుంచి 30 నిమిషాలు నీటిలో నానబెట్టాలి. ఇలా చేయడం వల్ల బియ్యం మెత్తబడుతాయి, పాయసం మరింత రుచిగా ఉంటుంది. ఇప్పుడు బియ్యాన్ని నీటిని వడకట్టి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక పెద్ద పాత్రలో పాలు పోసి మరిగించాలి. పాలు బాగా మరిగిన తర్వాత అందులో నానబెట్టిన బియ్యం వేసి నిరంతరం బాగా కలుపుతూ ఉండాలి. ఇలా చేయకపోతే గిన్నెకి అడుగంటిపోతుంది. బియ్యం మెత్తగా ఉడికిన తర్వాత చక్కెర, యాలకుల పొడి వేసి మరో 5 నుంచి 7 నిమిషాలు మరిగించాలి. చివరగా చిన్న ముక్కలుగా తరిగిన బాదం, కాజు, పిస్తా, కిస్మిస్ లు వేసి బాగా కలపాలి. ఆ శ్రీరాముడికి ఇష్టమైన పాయసం రెడీ అయ్యింది. ఇంకెందుకు ఆలస్యం కొద్దిగా చల్లారిన తర్వాత శ్రీరాముడికి నివేదించండి.

## నాగార్జున సాగర్ డ్యాం పరిధిలో

# మరోసారి అగ్నిప్రమాదం

**నల్గొండ:** నాగార్జునసాగర్ డ్యాం పరిధిలో మరోసారి అగ్నిప్రమాదం సంభవించింది. ఎర్త్ డ్యాం వద్ద ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు, డ్యాం అధికారులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే ఎర్త్ డ్యాంపై ఉన్న విద్యుత్ వైర్లు, సీసీ కెమెరాలు దగ్ధం అయ్యాయి. మరోవైపు గడిచిన రెండు, మూడు నెలల్లోనే నాగార్జున సాగన్ డ్యాం వద్ద పలుమార్లు అగ్నిప్రమాదం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. అసలు నిప్పు ఎలా పుడుతుందనే విషయం అర్థం కావడం లేదని అంటున్నారు. ఫిబ్రవరి 15వ తేదీన డ్యాం వద్ద డీఫారెస్ట్ ఏరియాలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మంటలు వ్యాపించి చెట్లు, మొక్కలు దగ్ధమైయ్యాయి. ఫిబ్రవరి 21న మళ్లీ సేమ్ సీన్ రిపీట్ అయ్యింది. డీఫారెస్ట్ ఏరియాలో మంటలు చెలరేగి చెట్లు, మొక్కలు కాలిపోయాయి. మార్చి 19న సైతం ప్రధాన ఎర్త్ డ్యాం వద్ద మంటలు వ్యాపించాయి. అక్కడ్నుంచి శివుడి పార్క్ వరకూ చెట్లు అగ్నిప్రమాదానికి గురయ్యాయి. అధికారుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే తరచూ



ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయనే విషయం మాత్రం అధికారులకు అంతుచిక్కడం లేదు. మంటలు ఎందుకు వ్యాపిస్తున్నాయనే విషయం అర్థంకాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

# దిద్దుబాటా... ఇంకో పొరపాటా?

కేంద్ర ప్రభుత్వం ఆశించినట్టుగానే హెచ్‌సీయూ ప్రతిష్ఠాత్మక విద్యా కేంద్రంగానే వెలుగొందింది. వారసత్వంగా సంక్రమించిన భూమిని కేటాయించడం, గౌరవ హోదాను అనుభవించడం తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఖర్చంతా యూజీసీ పద్దులే భరించాయి. యూనివర్సిటీని స్థాపించిన యాభయ్యేళ్లకు దాని భూములపై ఇప్పుడు జాతీయస్థాయిలో వివాదం జరుగుతున్నది. నిజానికి పాతికేళ్ల కిందనే ఈ చర్చను లేవనెత్తి ఉండాలి. ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు అప్పటి మీడియా కరపత్రికల్లా వ్యవహరించడం వల్ల, కేంద్రంలో కూడా ఆయన మిత్రపక్షమే ఉన్నందువల్ల చర్చ జరగలేదు. యూనివర్సి టీకి కేటాయించిన 2300 ఎకరాల్లో 800 ఎకరాల సంతర్పణ వివిధ సంస్థల పేర్లతో ఇష్టారాజ్యంగా జరిగి పోయింది. ఉస్మానియా యూనివర్సిటీకి ఉద్యమాల పుట్టినిల్లుగా పేరుండేది. ఉద్యమాల పర్యవసానంగా పుట్టిన యూనివర్సిటీ హైదరా బాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం. ఒక భావోద్వేగ పూరితమైన నేపథ్యం హెచ్‌సీయూ ఆవిర్భావానికి కారణమైంది. 1969, 1972 సంవత్సరాల్లో రెండు ఉధృతమైన ప్రత్యేక రాష్ట్ర ఉద్య మాలను తెలుగు నేల చూడవలసి వచ్చింది. ఆ ఉద్యమాలను చల్లార్చి ఉమ్మడి రాష్ట్రాన్ని కొనసాగించడం కోసం ఒక రాజీ ఫార్ములాగా ఆరు సూత్రాల పథకాన్ని కేంద్రం ముందుకు తెచ్చింది. అందులో ఒక అంశం హైదరాబాద్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు! విద్యారంగంలో వెనుకబాటుతనా నికి గురైన ప్రాంతంగా ఉన్న తెలంగాణలో ఒక ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ ఏర్పాటు, రాష్ట్ర రాజధానిలో ఆంధ్ర ప్రాంత విద్యార్థులకు కూడా సమాన అవకాశాలు లభించే విధంగా దాన్ని కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం ఉభయతారకంగా ఉంటుందని భావించారు. ఇందుకోసం రాజ్యాంగ సవరణ అవసరమైంది. 32వ సవరణ ద్వారా 371వ అధికరణానికి ‘ఈ’ అనే సబ్‌క్లాజ్‌ను జోడించారు. పార్లమెంట్ ఒక చట్టం ద్వారా హైదరాబాద్‌లో ఒక ‘సెంట్రల్’ యూనివర్సిటీని ఏర్పాటు చేయడానికి ఈ క్లాజ్ అవకాశం కల్పించింది. ఆ మేరకు హైదరాబాద్ విశ్వవిద్యాలయ చట్టం 1974ను పార్లమెంట్ ఆమోదించింది. అదే సంవత్సరం సెప్టెంబర్‌లో గెజెట్‌లో ఈ చట్టాన్ని ప్రచురించారు. భారత రాజ్యాంగంలో 371వ అధికరణం కింద ప్రస్తావించిన ఏకైక విశ్వవిద్యాలయం హెచ్‌సీయూ మాత్రమే! అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ఆదేశాల మేరకు నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుమారుగా 2,300 ఎకరాల భూమిని హైదరాబాద్ నగర కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గచ్చిబౌలిప్రాంతంలో కేటాయించింది. ఈ భూమిని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయడమో, లేక ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించడమో చేయలేదు. పూర్వపు హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల పరిధిలో వాటిని ఆనుకొని ఉన్న ఇతర జిల్లాల్లో ఉన్న భూములన్నీ నవాబ్ సొంత భూములుగా (‘సర్ఫెఖాస్’గా) పరిగణించేవారు. పోలీస్ యాక్షన్ తర్వాత ‘హైదరాబాద్ స్టేట్’ ఇండియన్ యూనియ న్‌లో విలీనమైంది. నైజాం... భూములన్నీ హైదరాబాద్ స్టేట్‌కు వారసత్వంగా లభించాయి. ఇందుకోసం మీర్ ఉస్మాన్ అలీఖాన్ జీవించి ఉన్నంతకాలం పెద్దమొత్తంలో కేంద్ర ప్రభుత్వం ప్రతి యేటా రాజభరణం చెల్లించింది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తర్వాత హైదరాబాద్ చుట్టూ ఉన్న వేలాది ఎకరాల భూములు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు అందుబాటులోకి వచ్చాయి. హైదరాబాద్ నగరంలో డజన్లకొద్దీ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటుకు ఈ భూముల లభ్యతే కారణం. హెచ్‌సీయూను ఒక ప్రతిష్ఠాత్మక విద్యా కేంద్రంగా మల చాలని కేంద్రం భావించినందు వల్ల అప్పటికి ప్రపంచ స్థాయిలో పేరున్న యూనివర్సిటీలను దృష్టిలో పెట్టుకొని వాటి స్థాయి లోనే భూములను కేటాయించాలని భావించారు. ఈ భూము లను కేటాయిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక జీవోను కూడా విడుదల చేసింది. కాకపోతే భూముల రిజిస్ట్రేషన్ జరగలేదు. అటువంటిది అవసరమని కూడా నాటి యూని వర్సిటీ పాలకవర్గాలు భావించలేదు. హెచ్‌సీయూకు చీఫ్ రెక్టార్‌గా ఒక గౌరవ హోదా కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పార్లమెంట్ చట్టపరంగానే కట్టబెట్టింది. కంచే చేను మేస్తుందని ఎవరు భావిస్తారు! అందువల్ల టెక్నికల్‌గా ఆస్తుల బదలాయింపు జరగలేదు. కేంద్ర ప్రభుత్వం ఆశించినట్టుగానే హెచ్‌సీయూ ప్రతి ష్ఠాత్మక విద్యా కేంద్రంగానే వెలుగొందింది. వారసత్వంగా సంక్ర మించిన భూమిని కేటాయించడం, గౌరవ హోదాను అనుభవించడం తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఖర్చంతా యూజీసీ పద్దులే భరించాయి. యూనివర్సిటీని స్థాపించిన యాభయ్యేళ్లకు దాని భూములపై ఇప్పుడు జాతీయస్థాయిలో వివాదం జరుగుతున్నది. నిజానికి పాతికేళ్ల కిందనే ఈ చర్చను లేవనెత్తి ఉండాలి. ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు అప్పటి మీడియా కరపత్రికల్లా వ్యవహరించడం వల్ల, కేంద్రంలో కూడా ఆయన మిత్రపక్షమే ఉన్నందువల్ల చర్చ జరగలేదు. యూనివర్సిటీకి కేటాయించిన 2300 ఎకరాల్లో 800 ఎకరాల సంతర్పణ వివిధ సంస్థల పేర్లతో ఇష్టారాజ్యంగా జరిగి పోయింది.

మిగిలిన దాంట్లో 400 ఎకరాల భూమిని తాడూ బొంగరం లేని క్రీడా నిపుణుల పేరుతో బిల్లీరావు అనే వ్యక్తికి కారుచౌకగా చంద్రబాబు కట్టబెట్టారు. అదీ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో, కేబినెట్ అనుమతి కూడా లేకుండానే ఈ కేటా యింపులు జరిగాయి. ఈ నాలుగొందల ఎకరాలు చాలవని ఎయిర్‌పోర్టు సమీపంలో మరో నాలుగొందల యాభై ఎకరా లను కూడా కట్టబెట్టారు. ఆనాటికి దేశంలోని అతిపెద్ద స్కాముల్లో ఈ బిల్లీరావు భూబాగోతం కూడా ఒకటి. వెంటనే ఎన్నికలు రావడం, చంద్రబాబు ప్రభుత్వం ఓడిపోవడం,తదనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డిప్రభుత్వం ఈ అక్రమ కేటాయింపును రద్దు చేయడం తెలిసిన విషయాలే! రద్దును సవాల్ చేస్తూ బిల్లీరావు కోర్టుల్ని ఆశ్రయించి ఇరవయ్యేళ్లపాటు వ్యాజ్యాన్ని నడిపాడు. రాష్ట్ర ప్రభుత్వాలు గట్టిగానే నిలవడంతో ఇరవయ్యేళ్ల తర్వాత గత సంవత్సరమే సుప్రీంకోర్టు తుది తీర్పునిస్తూ ఈ 400 ఎకరాలు ప్రభుత్వాని వేనని తేల్చేసింది. కేవలం టెక్నికల్‌గానే ప్రభుత్వ భూములు అనుకోవాలి. యూనివర్సిటీకి ఈ భూములను కేటాయించి నట్టు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అప్పటి రాష్ట్ర ప్రభుత్వ కార్య దర్శి రామచంద్రారెడ్డి యూనివర్సిటీ అధికారులకు 1975లోనే ఫిబ్రవరి 21న డీఓ లెటర్ ద్వారా కమ్యూ నికేట్ చేశారు. 2,300 ఎకరాలు కేటాయించినట్టు అందులో స్పష్టంగా పేర్కొన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రేషన్ చేసుకోలేదు గానీ, ఆ రోజుల్లో రెండు కోట్లు ఖర్చుపెట్టి కాంపౌండ్‌వాల్ కట్టించింది. ఇక్కడ తలెత్తుతున్న కీలకమైన ప్రశ్న ఏమిటంటే, రెండు ప్రాంతాల్లో జరిగిన ఉద్యమాల నేపథ్యంలో ఆరు సూత్రాల పథకంలో భాగంగా ఏర్పడిన యూనివర్సిటీ ఇది. పార్లమెంట్‌లో ప్రత్యేకంగా చట్టాన్ని చేసి ఏర్పాటుచేశారు. రాజ్యాంగంలో పొందుపరిచారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా భూముల్ని కేటాయించింది. ఈ భూముల్ని అకడమిక్ అవసరాలకు మాత్రమే వినియోగించాలని సాక్షాత్తూ రాష్ట్ర ప్రభుత్వమే షరతు కూడా విధించింది.

ఆ షరతును ఉల్లంఘించడానికి రాష్ట్ర ప్రభు త్వమే సిద్ధపడటం, అమ్ముకోవడానికి కూడా తెగించడం చెల్లు బాటయ్యే విషయాలేనా? నైతికంగానే కాదు, న్యాయపరంగా కూడా! విశ్వవిద్యాలయ వ్యవహారాల్లో రాష్ట్ర ప్రభుత్వం తప్ప స్టేక్ హోల్డర్లు ఇంకెవరూ లేరా?కోర్టు తీర్పు వెలువడిన వెంటనే తెలంగాణ ప్రభుత్వం ఈ భూముల్ని తాకట్టు పెట్టి పదివేల కోట్లు అప్పు తీసుకున్నదట! ఇప్పుడు వేలానికి సిద్ధపడింది. ఈ 400 ఎకరాల్లో పర్యా వరణ విధ్వంసం జరుగుతున్నదన్న వార్తలు వ్యాపించడం, హెచ్‌సీయూ విద్యార్థులు ఆందోళనకు దిగడంతో ఇది జాతీయ సమస్యగా మారింది.

ఈ నాలుగొందల ఎకరాల పరిధిలోని దట్టమైన పొదలు స్క్రబ్ అడవిగా అల్లుకున్నాయి. మంజీరా బేసిన్‌లో ఎత్తయిన ప్రాంతంలో ఉన్నందువల్ల ఇక్కడి కుంటల్లో చేరిన నీరు చుట్టుపక్కల ప్రాంతాల్లోని భూగర్భ జలాలకు ఊపిరిపోస్తున్నాయని చెబుతున్నారు. హెచ్‌సీయూ వెబ్‌సైట్ లోనే ఇక్కడున్న బయో డైవర్సిటీ గురించి అధికారికంగా పొందు పరిచారు. వంద ఎకరాల్లో బయో డైవర్సిటీని ధ్వంసం చేశారన్న వార్తలను అధికారికంగా రూఢి చేసుకున్న తర్వాతనే సర్వోన్నత న్యాయస్థానం సీరియస్‌గా స్పందించింది. ఏప్రిల్ 16వ తేదీ లోగా నివేదికను ఇవ్వాలని రాష్ట్ర సీఎస్‌ను ఆదేశించింది. న్యాయ స్థానం జోక్యంతో ప్రస్తుతం సద్దుమణిగినట్టు కనిపిస్తున్నా,ఎంపిక చేసుకున్న పత్రికల్లో వస్తున్న లీకు వార్తలు కొత్త కలవరాన్ని కలిగిస్తున్నాయి.

400 ఎకరాలే కాదు, మొత్తంరెండువేల ఎకరాల్లో ‘ఎకో పార్క్’ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నదనీ, ఇందుకోసం సెంట్రల్ వర్సిటీకి ఫ్యూచర్ సిటీలో వంద ఎకరాలు కేటాయించి, అక్కడికి తర లిస్తారనీ ముందుగా ఒక తెలుగు పత్రిక రాసింది. దానికి ప్రభుత్వ అనుకూల పత్రికగా పేరున్నది. ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి ఖండనా రాలేదు. రెండోరోజు ఒక జాతీయస్థాయి ఇంగ్లిషు పత్రికలో మరింత ప్రముఖంగా, సమగ్రంగా అదే వార్త వచ్చింది. ఎవరూ ఖండించలేదు. అధికారికంగా ప్రకటించనూ లేదు. ఇటువంటి వార్తల్నే జనం పల్స్ తెలుసుకోవానికి ప్రయో గించే ‘లీకు వార్త’లంటారు. నిజంగా ప్రభుత్వానికి అటువంటి ఉద్దేశం ఉన్నదా? వేలానికి అడ్డుపడ్డ సెంట్రల్ వర్సిటీ విద్యా ర్థులపై కోపమా? వాళ్ల మీద కోపంతో యూనివర్సిటీ స్థాయిని తగ్గించాలనుకుంటున్నారా? వాళ్లదేముంది. రెండు మూడేళ్లు చదువుకొని వెళ్లిపోతారు. నిజంగానే సెంట్రల్ వర్సిటీని వంద ఎకరాల్లోకి పంపించే ఉద్దేశం ఉంటే మాత్రం దాని స్థాపిత లక్ష్యాలను అవహేళన చేసినట్టే అవుతుంది. ఒక తప్పును దిద్దు కోవడానికి మరో తప్పు చేసినట్టవుతుంది. ప్రతిష్ఠాత్మకమైన కేంద్రీయ విశ్వవిద్యాలయంతో ఫుట్‌బాల్ ఆడుకునే హక్కు, అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నాయా అనే సంగతి కూడా తేలవలసి ఉన్నది.

## ఆ తర్వాత ప్రవేశాలకు నో చాన్స్.. కొత్త నిర్ణయంతో అడ్మిషన్లు తగ్గే అవకాశం

**హైదరాబాద్ :** ‘సీట్లు ఎక్కువ.. చేరే వారు తక్కువ. ఏటా 50శాతంలోపే అడ్మిషన్లు. 50కిపైగా కాలేజీల్లో సున్నా అడ్మిషన్లు’ వాస్తవ పరిస్థితులిలా ఉంటే డిగ్రీ ఫస్టియర్ అడ్మిషన్ల విషయంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి మరో వివాదాస్పద నిర్ణయం తీసుకున్నది. ఇది వరకు నాలుగైదు విడతల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించగా, ఇక నుంచి రెండు విడతలకే పరిమితం చేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ డిగ్రీలో ప్రవేశాలకు అవకాశం కల్పించొద్దని పేర్కొంది. శుక్రవా రం జరిగిన వైస్‌చాన్స్‌లర్ల సమావేశంలో డిగ్రీ అకాడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేయగా, జూన్ 16 నుంచే ఫస్టియర్ క్లాసులు ప్రారంభించాలని నిర్ణయించారు. 2024-25లో ఫస్టియర్‌లో 4,57,704 సీట్లుండగా, 1,96,442 మంది విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారు. 2.61లక్షల సీట్లు మిగిలాయి. చాలా కాలేజీల్లో 10-15 మంది మాత్రమే చేరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రైవేట్ కాలేజీలు అడ్మిషన్లు లేక కునారిల్లుతున్నాయి. నాలుగైదు విడతల్లో అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తేనే ఇలా ఉంటే.. మరీ రెండు విడతల్లోనే పూర్తిచేస్తే అడ్మిషన్లు మరింత తగ్గిపోయే ప్రమాదమున్నది. ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు జూలైలో విడుదలవుతాయి. ఎప్‌సెట్



కౌన్సెలింగ్ పూర్తికావాలంటే జూలై గడిచిపోతుంది. జేఈఈ కౌన్సెలింగ్ తర్వాత మరో విడత ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. బీ ఫార్మసీ కౌన్సెలింగ్ ఆగస్టు, సెప్టెంబర్‌లో పూర్తవుతుంది. మరీ జూన్‌లోనే డిగ్రీ ఫస్టియర్ అడ్మిషన్లు పూర్తిచేస్తే బీటెక్, బీ ఫార్మసీ, లా కోర్సులు, ఐఐటీలు, ఎన్ఐటీల్లో సీట్లు రాని, సప్లిమెంటరీ విద్యార్థులు చదువులకు దూరం కావాల్సిందేనా..? అని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి.

## వాట్సాప్ గ్రూపుల్లోకి పోలీసులు?

గ్రామాల నుంచి నగరాల్లోని వార్డుల దాకా..

ప్రజలు ఏమనుకుంటున్నారో తెలియాలి

ప్రభుత్వం ఆదేశం.. రంగంలోకి ఇంటెలిజెన్స్



**హైదరాబాద్ :** ‘మన ప్రభుత్వం గురించి.. పనితనం గురించి ప్రజలు ఏమనుకుంటున్నారు? మనకు వ్యతిరేకంగా ఎవరెవరు పోస్టులు పెడుతున్నారు? వాళ్లను కట్టడి చేయడం ఎలా? గ్రామాల్లో మన పార్టీ పరిస్థితి ఎలా ఉంది? తక్షణమే తెలుసుకోండి..’ అని సీఎం రేవంత్‌రెడ్డి సహా ప్రభుత్వ పెద్దలు అలా ఆదేశించారో లేదో.. నిఘా వ్యవస్థ ఇలా రంగంలోకి దూకినట్టు తెలిసింది. ‘బుజ్జగిస్తారో.. భయపెడతారో.. ఎలా దారిలోకి తెచ్చుకుంటారో తెలియదు. గ్రామాల నుంచి, మండలం, జిల్లా స్థాయి వరకు వాట్సాప్ గ్రూపుల్లో మన సిబ్బంది ఉండాలె. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతున్నదో ఎప్పటికప్పుడు సమాచారం అందించాలె. మీ కష్టానికి తగిన ప్రతిఫలం ఉంటుంది’ అంటూ కిందిస్థాయి హోంగార్డు, కానిస్టేబుళ్ల వరకూ ఉన్నతాధికారుల నుంచి స్పష్టమై న ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది. ఇప్పటికే స్టేషన్ల పరిధిలోని గ్రామాలపై కానిస్టేబుళ్లు, హోంగార్డులు వాట్సాప్ గ్రూపుల వేటలో నిమగ్నమైనట్టు తెలిసింది.


**‘అన్నా.. మీ గ్రూప్‌లలో యాడ్ చేయండి..’**

గ్రామాల నుంచి ఎవరైనా పోలీస్‌స్టేషన్‌కు వస్తే.. ‘మీ గ్రామంలో ఎన్ని వాట్సా ప్ గ్రూపులు ఉండొచ్చు. పార్టీల గ్రూపు లు, ఊరి అభివృద్ధి గ్రూపులు, కులాల వారీగా, మతాల వారీగా, యూత్ గ్రూప్ లు, ఇంటిపేర్లతో ఉన్న గ్రూపులు, దావత్‌ల గ్రూపులు ఎన్ని ఉన్నాయి? వాటి అడ్మిన్‌లు ఎవరు? కొంచెం వివరాలు చెప్పండన్నా.. వాటిల్లో మమ్మల్ని కూడా యాడ్ చేయండి’ అంటూ పోలీసులు బతిమాలుకుంటున్నట్టు తెలిసింది. గ్రామాలు, పట్టణస్థాయి, రాష్ట్రస్థాయి గ్రూపు ల్లో ఏమేం జరుగుతున్నదో తెలుసుకునే బాధ్యతను ఆయా స్టేషన్ల పరిధిలోని కానిస్టేబుళ్లు, ఇంటెలిజెన్స్ సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది భుజాన వేసుకున్నారు. వాట్సాప్ గ్రూపుల్లో త్వరగా చేరడానికి మండలస్థాయి, గ్రామస్థాయిలోని కాంగ్రెస్ నాయకుల సహకారం తీసుకోవాలని పరోక్షంగా ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది.

**టార్గెట్ 3 లక్షల గ్రూపులు..?**

తెలంగాణలో 12,848 గ్రామాలు ఉండగా.. వాటికి ఆవాస గ్రామాలు కలిపి 13వేల పైచిలుకు ఉన్నాయి. వీటిల్లో ఒక్కో గ్రామంలో కనీసం విలేజ్ గ్రూపు-1, కులాల వారీగా-8, పార్టీల గ్రూపులు -4, మతాల వారీగా %-% 2, ఇంటిపేరిట- 5-10, దావత్‌లు, ఎంటర్‌టైన్‌మెంట్-2-5 వరకు మొత్తంగా 20 వాట్సాప్ గ్రూప్‌లున్నాయి. ఇక నగరాలు, మండలాలు, జిల్లా కేంద్రాల్లోని వార్డుల వారీగా గ్రూపులు, నిరుద్యోగుల గ్రూపులు, విద్యా సమాచారం గ్రూపులు, జర్నలిస్టుల గ్రూపులు, దినపత్రికల గ్రూపులు, ఆఖరికి డ్రంక్ అండ్ డ్రైవ్ గ్రూపులు మొత్తం కలిపితే.. సుమారు 5.50 లక్షల పైగానే ఉంటాయని పోలీసుశాఖ అంచనాకు వచ్చినట్టు సమాచారం. వీటిల్లో కనీసం 3 లక్షల గ్రూపుల్లోని సమాచారం హెడ్ ఆఫీసుకు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని, అవసరమైతే ఇందుకు ప్రత్యేకంగా ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వ పెద్దలు నిర్దేశించినట్టు తెలిసింది.

## అన్న వచ్చిండంటే.. తమ్ముళ్లకు పండగే..




**పాపన్నపేట(మెదక్):** మెతుకుసీమ గులాబీ దళంలో పట్టు సాధించడానికి ‘కంఠప్ప’ పావులు కదుపుతున్నాడు. మెదక్ అసెంబ్లీ టికెట్‌పై కన్నేసిన ఆయన మొదట జిల్లా అధ్యక్ష పదవిపై ఆశలు పెంచుకుంటున్నాడు. ఈనెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ అనంతరం పార్టీ సంస్థాగత ఎన్నికలపై దృష్టి పెడతారన్న సంకేతాల మేరకు ఆయన గులాబీ సైనికులను మచ్చి క చేసుకునే పనిలో పడ్డాడు. ఈక్రమంలో పాపన్నపేట మండల నాయకులకు వేసవి టూర్ ఆఫర్ చేశాడు. త్వరలోనే విహారయాత్రకు తరలివెళ్లేందుకు తమ్ముళ్లు తెగ ఆరాట పడుతున్నారు.

**అక్కను మరిచి.. అన్న పంచన చేరి**

ఇంత వరకు అక్క మాట జవ దాటని వీర విధేయులు సైతం.. కంఠప్ప పంచన చేరుతున్నారు. పాపన్నపేట మండలంలోని బీఆర్ఎస్ పార్టీలో ముఖ్యులైన పంచ పాండవులు. గ్రూపు రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. నియోజకవర్గ పర్యటనకు వచ్చినప్పుడల్లా వెంట తిరిగిన తమ్ముళ్లకు సాయంత్రం ఆయన విందు ఇచ్చి మచ్చిక చేసుకుంటున్నాడు. ఈనెల 1న గాంధారిపల్లిలో భారీ విందు ఏర్పాటు చేసి తమ్ముళ్లను ఖుషీ చేశాడు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్ సంపాదించగలిగతే కాంగ్రెస్‌లో ప్రస్తుతం క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న తన మాజీ అనుచరులు తనకు మద్దతు ఇస్తారన్న నమ్మకం ఆయనలో కనిపిస్తుంది. ఎమ్మెల్యే టికెట్ కోసం గత ఏడేళ్లుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న ఆయన భారీగా ఖర్చు చేస్తున్నాడు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోవడంతో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించడానికి తన వంతు ప్రయత్నం చేసి విఫలుడయ్యాడు. పరాజయ భారంతో అక్క కొంత కాలం మౌన దీక్ష పాటించింది. అయితే ఈ అవకాశాన్ని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు పట్టు వదలని విక్రమార్కుడిలా తన కంటూ బలమైన కేడర్‌ను తయారు చేసుకునే పనిలో పడ్డాడు. ఈ పరిణామాన్ని సునిశితంగా గమనిస్తున్న అక్క పార్టీ అధ్యక్ష పదవిని బీసీకి కట్ట బెట్టాలనే డిమాండ్‌తో కంఠప్పకు చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఏడుపాయల జాతరలో రథోత్సవానికి ఇద్దరు నాయకులు కలసి వస్తారని, పార్టీవర్గాలు సమాచారం ఇచ్చాయి. ఈ మేరకు ఒక వర్గం నాగ్సాన్‌పల్లిలో.. మరోవర్గం లక్ష్మీనగర్‌లో సేద దీరాయి. కానీ ఏం జరిగిందో ఏమో గాని మొదట అక్క కొంత మంది నాయకులతో కలసి విడిగా ఏడుపాయలకు వచ్చారు. ఆమె వెళ్లిన కొంత సేపటికి అన్న వెంట అధిక సంఖ్యలో గులాబీ నాయకులు తరలివచ్చారు. ఒకే పార్టీలో నెలకొంటున్న వర్గ విభేదాలు రోజు రోజుకు ముదిరి పాకాన పడుతున్నాయి. ఈ ఇద్దరు పార్టీ నాయకులు ఎక్కడా ఎదురు పడకుండా చూసుకుంటున్నారు. ఒక వేళ కనిపించినా ఎడముఖం.. పెడముఖం అన్నట్లుగానే వ్యవహరిస్తున్నారు. ఈ పరిణామాలు పార్టీకి నష్టం చేకూర్తున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110